గీటురాయి
సహజీవన భావనల పావురాయి
వారపత్రిక 29-8-2025 ₹15/-




# పశ్చిమాసియాలో మళ్ళీ యుద్ధ మేఘాలు






# వివాదాస్పద బిల్లుపై విపక్షాల ధ్వజం



గీటురాయి
సహజీవన భావనల సౌధురాయి
వారపత్రిక
GEETURAI WEEKLY
Sandesha Bhavanam, Lakkadkot,
Chatta Bazar, Hyderabad-500 002.
Ph: 040-24564583; 24576237
Email : geeturaiweekly@gmail.com
Website: www.tiptrust.in; geeturai.in
Our Bank A/c Details:
Geeturai Weekly, A/c No.1042789768
IFSC : CBIN0282407, Central Bank of India
Noor Khan Bazar Branch, Hyderabad

సంపుటి: 47 సంచిక: 34 హైదరాబాద్
శుక్రవారం 29 ఆగస్టు 2025 రూ.15-00
రబీఉల్ అవ్వల్ 5 1447 హిజ్రీ

**తొలిగీటు**

**ఎవరు తన సోదరునికి అవసరమున్నప్పుడు ఆదుకుంటారో వారి అవసరానికి అల్లాహ్ వారిని ఆదుకుంటాడు.**

– మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం)

**సంపాదకులు**
**ఎస్.ఎమ్. మలిక్**

**అసోసియేట్ ఎడిటర్**
**అబ్దుల్ వాహెద్**

**ఎడిటోరియల్ ఇన్‌ఛార్జి**
**ముహమ్మద్ ముజాహిద్**

గ్రాఫిక్స్
**ఎల్. లక్ష్మీనారాయణ**
**ముహమ్మద్ రఫీఖ్**

సర్క్యులేషన్ మేనేజర్
**అబ్దుల్ జలీల్, 9704317015**

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. e-mail: geeturaiweekly@gmail.com




## లోపల...

| | | |
|---|---|---|
| నిరుద్యోగం | ...... | 04 |
| పశ్చిమాసియాలో మళ్ళీ యుద్ధ మేఘాలు | ...... | 05 |
| వివాదాస్పద బిల్లుపై విపక్షాల ధ్వజం | ...... | 08 |
| మహనీయ సఅద్ బిన్ అబీ వక్కాస్ (రజి) – 3 | ...... | 10 |
| దేశం పిలుస్తోంది! (కవిత) | ...... | 13 |
| మీ ప్రతిభకు గుర్తింపు లేనిచోట ఉండకండి | ...... | 14 |
| వెలుగుబాట (తఫ్‌హీముల్ ఖుర్ఆన్ అనువాదం) | ...... | 18 |
| అడుగుజాడలు (సహీహ్ బుఖారీ అనువాదం) | ...... | 19 |
| ఖుర్ఆన్‌పై అతిపెద్ద అపవాదు | ...... | 21 |
| స్వామిభక్తికి ప్రాధాన్యమిచ్చిన ఎర్రకోట ప్రసంగం | ...... | 22 |
| అన్నదానం అల్లాహ్‌కు ఎంతో ఇష్టం-1 | ...... | 24 |
| అమ్మకానికి అమ్మానాన్న (కథ) | ...... | 28 |
| సమాజ సేవలో దైవప్రవక్త (స) | ...... | 30 |
| సంక్షిప్త భారతం | ...... | 32 |
| సర్వత్రా | ...... | 33 |
| తల్లిపాదాల క్రింద స్వర్గం | ...... | 34 |

**పెత్తనం చేయకండి...**




మార్వాడీ గోబ్యాక్ అని
చేస్తున్నరోయి పోరాటం
హక్కులు దోస్తున్నారని
మొదలయింది ఆరాటం!
వ్యాపారం పేరు మీద
ఆపండి బాబు దోపిడీ
ఆధిపత్యపు ధోరణితో
చేయకండోయి కిలాడీ!!

– యం.డి. ఉస్మాన్ ఖాన్

# ఆలోచన

## నిరుద్యోగం

కేంద్ర ప్రభుత్వం దేశంలో ఉపాధిపై విడుదల చేసిన నెలవారీ నివేదిక ప్రకారం పరిస్థితి చాలా దయనీయంగానే ఉంది. 15–29 సంవత్సరాల మధ్య వయస్సు గల వారిలో 15% మంది నిరుద్యోగులు. అన్ని వయస్సుల వారి మొత్తం నిరుద్యోగం రేటు 5.6%గా నమోదైంది. గణాంకాల శాఖ కొత్తగా ప్రారంభించిన నివేదికల శ్రేణిలో ఇది రెండవది. దీనిని పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే (PLFS) అని పిలుస్తారు. గతంలో, ఈ నివేదికలు సంవత్సరానికి ఒకసారి, పట్టణ ప్రాంతాలకు మూడు నెలలకు ఒకసారి ప్రచురించబడేవి. ఇప్పుడు నెల నెలా ప్రచురిస్తామన్నారు.

ఈ నివేదిక 'కరెంట్ వీక్లీ స్టేటస్' పద్ధతి ఆధారంగా నిరుద్యోగుల డేటాను ప్రచురించింది. 'కరెంట్ వీక్లీ స్టేటస్' నిర్వచనం ప్రకారం, సర్వేకు ముందు వారంలో కనీసం ఒక గంట పని చేసిన ఏ వ్యక్తి అయినా 'ఉద్యోగి'గానే పరిగణించబడతాడు. కనీసం ఒక్క గంట కూడా వారంలో పని దొరకని వ్యక్తి మాత్రమే నిరుద్యోగిగా పరిగణించబడతాడు.

నిరుద్యోగాన్ని లెక్కించే యూజువల్ స్టేటస్ పద్ధతికి ఇది భిన్నమైనది. యూజువల్ స్టేటస్ పద్ధతిలో ఒక వ్యక్తి గత 365 రోజులలో ఎక్కువ సమయం పని చేసినట్లయితే ఉద్యోగిగా పరిగణించబడతాడు.

ప్రభుత్వం ఇప్పుడు నెలవారి నివేదికలు ఇస్తానని చెప్పింది కాబట్టి, నెలవారి నివేదికల్లో యూజువల్ స్టేటస్ ప్రకారం నిరుద్యోగం కుదరదు కాబట్టి 'కరెంట్ వీక్లీ స్టేటస్' పద్ధతి పాటిస్తున్నట్లు చెప్పుకోవచ్చు. ఈ నెలవారీ నివేదికలు అర్థవంతంగా ఉండాలంటే, నిరుద్యోగానికి నిర్వచనంలో 'వారానికి ఒక గంట పని' చేస్తే చాలనే దానిని మార్చకపోతే ఈ గణాంకాల వల్ల ప్రయోజనమే ఉండదు.

విచిత్రమేమిటంటే, వారానికి గంట పనిచేస్తే చాలు ఉద్యోగిగా లెక్కించిన ఈ లెక్కల ప్రకారం కూడా 15% మంది యువత నిరుద్యోగులే. అంటే దేశంలో నిరుద్యోగం ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

'కరెంట్ వీక్లీ స్టేటస్' పద్ధతిలో తక్కువ ఉపాధి లేదా పైకి కనిపించని నిరుద్యోగం సర్వేల దృష్టికి రాదు. ఈ పద్ధతి వారానికి ఒక గంట చేసిన పనిని కూడా ఉపాధిగా గుర్తిస్తుంది. అసంఘటిత రంగం విస్తృతంగా ఉన్న భారతదేశంలో ఇది గణాంకాలను తికమకపెడుతుంది.

ఒక వ్యక్తి వారానికి కనీసం ఒక గంట పాటు ఏదైనా పనిచేస్తే ఈ స్వల్పకాలిక పని నిజంగా ఒక అర్థవంతమైన ఉద్యోగం అవుతుందా? అంటే, మంచి జీతం, ఆరోగ్యం, సెలవులు, పదవీ విరమణ వంటి సామాజిక భద్రతా ప్రయోజనాలతో కూడిన ఉద్యోగం అవుతుందా?వారానికి మూడు గంటలు పని చేసే ఒక వ్యక్తిని నిజంగా ఉపాధి పొందిన వ్యక్తిగా పరిగణించవచ్చా? రాయిటర్స్ వార్తా సంస్థ నిర్వహించిన సర్వేలో 70 శాతానికి పైగా స్వతంత్ర ఆర్థికవేత్తలు, జూన్ నెలలో అధికారిక నిరుద్యోగ రేటు 5.6 శాతం అవాస్తవమని చెప్పారు. ప్రభుత్వం రాయిటర్స్ నివేదికను ఖండించింది. ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీస్ వంటి ప్రముఖ విద్యా సంస్థలలో ప్లేస్‌మెంట్స్ తగ్గడం నుండి బిగ్ టెక్ సంస్థలలో ఉద్యోగాల తొలగింపుల వరకు ఉద్యోగ మార్కెట్ కుంచించుకు పోతోంది.

'కరెంట్ వీక్లీ స్టేటస్'తో పోలిస్తే, యూజువల్ స్టేటస్ అనేది ఉపాధి స్వభావం, స్వరూపాన్ని అంచనా వేసే మెరుగైన పద్ధతి. కాని ఈ పద్ధతిని వదిలి, ఉద్యోగరేటు పెంచి చూపించే నెలనెలా నివేదికల వల్ల ప్రయోజనమేమిటి?

**కవరు కథనం** | **అబ్దుల్ వాహెద్**

# పశ్చిమాసియాలో మళ్ళీ యుద్ధ మేఘాలు



**ఈరాన్ – ఇ్రసాయిల్ యుద్ధం ముగిసి ఇంకా రెండు నెలలు కూడా కాలేదు. పశ్చిమాసియాలో శాంతి ఇంకా అస్థిరంగానే ఉంది. కొత్తగా యుద్ధం మళ్లీ ప్రారంభమయ్యే సూచనలు కనిపిస్తున్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు.**

జూన్‌లో ఈరాన్, ఇ్రసాయిల్ మధ్య జరిగిన 12 రోజుల యుద్ధం తర్వాత కూడా పరిస్థితి ఉద్రిక్తంగానే కొనసాగుతోంది. ఈరాన్ అణు స్థావరాలపై దాడి చేస్తామని అమెరికా, ఇ్రసాయిల్ బెదిరిస్తున్నాయి. మరోవైపు ఈ బెదిరింపులను ఈరాన్ ఖాతరు చేయడం లేదు. యురేనియం శుద్ధీకరణను కొనసాగిస్తామని కూడా ఈరాన్ నిర్ద్వంద్వంగా ప్రకటించింది.

ఇరువైపుల నుండి బెదిరింపులు, ప్రకటనలు, ప్రతి–ప్రకటనలు కొనసాగుతున్నాయి. ఈరాన్ సుప్రీం లీడర్ అలీ ఖామెనేయికి సన్నిహితు డైన ఒక సీనియర్ సైనిక అధికారి ఇటీవల ఒక సందర్భంలో మాట్లాడుతూ అమెరికా ఆర్థికంగా దాడి చేసే స్థితిలో లేదని అన్నారు. అమెరికాకు ఉన్న సైనిక పరిమితుల రీత్యా ఈరాన్‌పై దాడి చేయడం అమెరికాకు సులభం కాదని కూడా చెప్పాడు.

ఈరాన్ సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ కార్యదర్శి అలీ లారిజాని లెబనాన్‌లో ఒక టీవీ ఇంటర్వ్యూలో ఈ మాటలు చెప్పాడు. "అమెరికా నిజంగా చర్చల ద్వారా పరిష్కారం కోరుతుంటే, మేము సానుకూలంగా స్పందిస్తాం. కానీ చర్చలతో మభ్యపుచ్చి యుద్ధానికి సన్నాహాలు చేయాలనుకుంటే మాట్లాడడం నిష్ప్రయోజనం" అన్నారు. లారిజాని మాటల్లో దౌత్యపరమైన పరిష్కారానికి తలుపులు తెరిచి ఉన్నాయని ఒకవైపు అర్థమవుతున్నప్పటికీ అమెరికాను అనుమానంగానే ఈరాన్ చూస్తుందన్న విషయం కూడా అర్థమవుతోంది.

ఫ్రాన్స్, బ్రిటన్, జర్మనీ దేశాలు కూడా అమెరికాకు ఎప్పటి మాదిరిగానే వంత పాడుతూ ఈరాన్‌కు హెచ్చరికలు జారీ చేశాయి. గత చరిత్రను పరిశీలిస్తే ఈ హెచ్చరికలను ఈరాన్ ఎన్నడూ ఖాతరు చేసిన దాఖలా లేదు. యూరపు దేశాలు ఈరాన్‌కు ఆగస్టు నెలాఖరులోగా అణు చర్చలను పునఃప్రారంభించి, నిర్దిష్ట ఫలితాలను సాధించాలని, లేకపోతే ఐక్యరాజ్యసమితి ఆంక్షలు మళ్లీ విధిస్తామని హెచ్చరిం చాయి. ఈరాన్ ఆంక్షలను పట్టించుకున్న దాఖలా కూడా

గతంలో లేదు. యూరపు దేశాలను ఖాతరు చేసినట్లు కూడా కనబడదు.

ఈరాన్‌పై జూన్‌లో ఇస్రాయీల్ సైనికదాడులు చేసింది. యుద్ధం ప్రారంభమైన తొమ్మిదో రోజు అమెరికా కూడా యుద్ధరంగంలో దూకింది. ఈరాన్ అణుస్థావరాలపై అమెరికా బాంబులేసింది. ఈ దెబ్బతో ఈరాన్ అణుకార్యక్రమం నాశనమైందని ట్రంప్ ప్రభుత్వం పేర్కొంది. దాడులు అలాంటి ఫలితాలు సాధించి ఉన్నట్లయితే ఇప్పుడు అణు కార్యక్రమాన్ని ఆపేయాలంటూ ఈరాన్‌కు ఈ బెదిరింపులెందుకు చేస్తున్నారు? అమెరికా దాడులు ఘోరంగా విఫలమయ్యాయా? అనే ప్రశ్నలు ఈ నేపథ్యంలో తలెత్తుతున్నాయి. అమెరికా దాడుల్లో ఈరాన్ అణు కార్యక్రమం దెబ్బతినలేదన్న విశ్లేషణలు కూడా ఈ దాడుల తర్వాత వచ్చాయన్నది గమనించాలి.

అణు కార్యక్రమం పౌర అవసరాల కోసం మాత్రమేనని, బాంబు తయారు చేసే ఉద్దేశ్యం లేదని ఈరాన్ పదేపదే చెబుతోంది. కాని మారిన ప్రస్తుత పరిస్థితుల్లో ఈరాన్ అణుబాంబు తయారు చేసుకున్నా ఆశ్చర్యపోవలసిన పనిలేదు. ఇస్రాయీల్ వద్ద అణుబాంబులున్నాయన్నది అందరికీ తెలిసిన విషయమే. కాని ఇస్రాయీల్ అణు కార్యక్రమాన్ని ప్రపంచానికి ప్రకటించలేదు. అదంతా బహిరంగ రహస్యం. ఇస్రాయీల్ అణు కార్యక్రమంపై పెదవి విప్పని అమెరికా, పాశ్చాత్య దేశాలు ఈరాన్ అణు కార్యక్రమంపై చేస్తున్న రాద్ధాంతం గమనిస్తే చాలు ఉద్దేశ్యాలేమిటో స్పష్టంగా తెలుస్తుంది.

ఇప్పుడు ఈరాన్‌కు అమెరికాకు మధ్య చర్చలు నిలిచిపోయాయి. ఉద్రిక్తతలు పెరుగుతున్నాయి. ఇరుపక్షాలు యుద్ధ సన్నాహాల్లో వున్నట్లు కనిపిస్తున్నాయి. ఈరాన్ తాను సైనికంగా మరింత బలపడే ప్రయత్నాలు చేస్తోంది. ఇస్రాయీల్‌తో యుద్ధం ఈరాన్‌కు చాలా పాఠాలు నేర్పింది. ఈరాన్ ఈ యుద్ధంలో చాలా నష్టపోయిందన్నది వాస్తవమే. అయినప్పటికీ అమెరికా, ఇస్రాయీల్ దేశాలకు అది ఏడు చెరువుల నీళ్ళు తాగించింది. ఈరాన్ మిస్సయిళ్ళ వర్షానికి ఇస్రాయీల్ బెంబేలెత్తి చివరకు యుద్ధవిరమణ కోసం అమెరికాను శరణు కోరవలసి వచ్చిందని పలువురు విశ్లేషించారు.

ఈ నేపథ్యంలో ఈరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయ్ విలేకరుల సమావేశంలో చెప్పిన మాటలు గమనార్హమైనవి. ఇస్రాయీల్ విస్తరణ వాదాన్ని అడ్డుకోకపోతే పశ్చిమాసియా ముగింపులేని యుద్ధాల్లో మునిగిపోతుందని ఆయన హెచ్చరించారు.

ఈ హెచ్చరికలకు ఎంతైనా ప్రాముఖ్యం ఉంది. ఇప్పుడు సౌదీ అరేబియా తదితర అరబ్బు దేశాలు పరోక్షంగా ఇస్రాయీల్‌కు మద్దతిస్తున్నాయన్నది అందరికీ తెలిసిన విషయమే. టర్కీ కూడా అలాంటి వైఖరినే అవలంబిస్తోంది. కానీ ఈ దేశాల్లో ప్రజలు తమ ప్రభుత్వాలను గమనిస్తున్నారు. ప్రజాగ్రహం ఈ దేశాల పాలకులను పునరాలోచించేలా చేస్తోంది. ఇప్పటికీ ఈ దేశాలు అమెరికాకు వంతపాడడం తగ్గించాయన్నది ఇటీవలి పరిణామాలను గమనిస్తే తెలుస్తుంది.

ఇస్రాయీల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ఇటీవల “గ్రేటర్ ఇస్రాయీల్” గురించి మాట్లాడాడు. స్వయంగా ఇస్రాయీల్ ప్రజలు నెతన్యాహుతో విసిగిపోయారని వార్తలను బట్టి తెలుస్తోంది. పదవిలో కొనసాగడానికి నెతన్యాహు నిరంతరం యుద్ధాలను కొనసాగిస్తున్నాడనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. గ్రేటర్ ఇస్రాయీల్ అంటే ఆక్రమిత పాలస్తీనియన్ భూభాగాలతో పాటు ఇరుగుపొరుగు అరబ్ దేశాలలోని కొన్ని ప్రాంతాలు కూడా ఉన్నాయని స్వయంగా నెతన్యాహు ఇచ్చిన వివరణ ఆయన ఆలోచనలు ఈ ప్రాంతాన్ని ఎలాంటి భయంకర యుద్ధ సుడిగుండంలో నెడుతున్నాయో అర్థం చేసుకోవచ్చు.

ఈ “గ్రేటర్ ఇస్రాయీల్” ఆలోచన ఆధిపత్య, విస్తరణవాద స్వభావానికి నిదర్శనమని ఈరాన్ అంటోంది. గ్రేటర్ ఇస్రాయీల్ అంటూ నెతన్యాహు చేసిన ప్రకటన తర్వాత అమెరికా కూడా అరబ్బు దేశాలకు నచ్చచెప్పడం కష్టమవుతుంది.

ఇటీవల ఈరాన్ అగ్రనేతలు కాల్పుల విరమణ దశలో లేము ఇంకా యుద్ధకాలంలోనే ఉన్నామంటూ ప్రకటనలు చేయడం కూడా గమనార్హమైనదే. మరోవైపు ఇస్రాయీల్ సైన్యాధిపతి తదుపరి దాడులకు సిద్ధమని ప్రకటించాడు.

ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో మరోసారి యుద్ధం ప్రారంభం కావచ్చని నిపుణులు విశ్లేషిస్తున్నారు. కాని ట్రంప్ నుంచి పూర్తి సహకారం లేకపోతే ఇస్రాయీల్ ఈ సాహసానికి ఈ సారి పూనుకోదు. ఒకసారి తలబొప్పి కట్టింది. అమెరికా యుద్ధంలో రావాలని బాహాటంగా వేడుకున్న ప్రకటనలు కూడా ఇస్రాయీల్ నుంచి వచ్చాయి.

ఇస్రాయీల్, ఈరాన్ ఈ రెండు దేశాల సైనికశక్తి ఖచ్చితంగా ఎంత ఉందన్నది ప్రపంచానికి తెలియదు. కాని ఇస్రాయీల్‌ను బెంబేలెత్తించే మిస్సయిళ్ళు ఈరాన్ వద్ద ఉన్నాయని మాత్రం ఈ యుద్ధంలో స్పష్ట మయ్యింది. మరోవైపు ఇస్రాయీల్ వాయురక్షణ వ్యవస్థ బీటలు వారింది. గొప్పగా చెప్పుకున్న ఐరన్ డోమ్ హూతీల మిస్సయిళ్ళను కూడా ఆపలేకపోయింది. పైగా ఈ ఐరన్ డోమ్ ఖర్చు చాలా ఎక్కువ. కాబట్టి అమెరికా సహాయం లేకపోతే ఇస్రాయీల్ యుద్ధంలో నిలబడడం సాధ్యం కాదు. మరోవైపు ఈరాన్ ఈ యుద్ధాన్ని ముందే ఊహించి సిద్ధమవుతున్న సూచనలున్నాయి. ఇంతకు ముందు చర్చలు జరుగుతున్నాయి కాబట్టి యుద్ధం జరిగే అవకాశాలు లేవనే భ్రమలో ఈరాన్ ఉండేది. అందువల్లనే యుద్ధం ప్రారంభమైన

మొదట్లో ఈరాన్ పెద్దస్థాయిలో నష్టపోయింది. మరోవైపు ఇస్రాయీల్ గూఢచారులు కూడా ఈరాన్‌లో పని చేసి అవసరమైన సమాచారాన్ని ఇస్రాయీల్‌కు అందించారు. ఈసారి పరిస్థితి అలా లేదు. ఈరాన్ సిద్ధంగా ఉన్నానని చెబుతోంది. ఈరాన్‌లో ఎవరయినా గూఢచారులు అనే అనుమానం వస్తే చాలు కఠినమైన చర్యలు తీసుకుంటూ ఇస్రాయీల్ గూఢచార సంస్థకు నిలువనీడ లేకుండా చేస్తున్నారు.

అంటే ఈరాన్ ఇప్పుడు సుదీర్ఘ యుద్ధానికి తయారవుతోంది. ఈసారి గనక యుద్ధం జరిగితే ఆశ్చర్యకరమైన వ్యూహ ప్రతివ్యూహాలు ముందుకు రావచ్చు. ఈ పరిణామాలు అమెరికాకు ఆమోద యోగ్యమా అన్నది ప్రశ్న.

నిజానికి ఇస్రాయీల్ యుద్ధం చేస్తున్నది ఈరాన్ అణుకార్యక్రమాన్ని నివారించడానికి కాదు, అది కేవలం సాకు మాత్రమే. పశ్చిమాసియాలో తానే పెద్ద గుండాగా ఉండాలన్నది ఇస్రాయీల్ ఉద్దేశ్యం. ఈ ప్రాంతంలో ఏ దేశంపై అయినా ఎప్పుడైనా నిర్భయంగా వైమానిక దాడులు చేసే స్థితిలో ఉండాలని అది భావిస్తోంది. గతంలో ఇరాక్ యుద్ధానికి కూడా ఇదే కారణం.

గత రెండు దశాబ్దాలుగా అమెరికా సహాయంతో, ఈరాన్‌ను బలహీనపరచడానికి ఇస్రాయీల్ ప్రయత్నించింది. ఇప్పుడు అమెరికా ప్రత్యక్షంగా యుద్ధానికి దిగి ఈరాన్‌ను నాశనం చేయాలన్నది ఇస్రాయీల్ కోరిక.

ఈరాన్‌పై ఇస్రాయీల్ దాడి వెనుక మూడు లక్ష్యాలున్నాయి. గాజాలో ఇస్రాయీల్ దాడులు నిష్ఫలమయ్యాయి. హమాస్ కంచుకోటను ఇస్రాయీల్ పడగొట్టలేకపోయింది. హూతీలను లొంగదీయడం ఇస్రాయీల్‌కే కాదు అమెరికాకు కూడా సాధ్యం కాలేదు. అటు హిజ్బుల్లా కూడా ఇప్పుడు బలంగానే ఉంది. ఈ సంస్థలు బలంగా ఉండడానికి ప్రధాన కారణం ఈరాన్. కాబట్టి ఈరాన్‌ను దెబ్బతీస్తే ఈ సంస్థలను నిర్వీర్యం చేయవచ్చన్నది ఇస్రాయీల్, అమెరికాల ఎత్తుగడ.


ఈరాన్‌పై ఇస్రాయీల్ దాడి అమెరికాకు తెలియకుండా జరిగిందని భావించడం పొరబాటు. ముఖ్యంగా మూడు ప్రధాన లక్ష్యాలతో ఇస్రాయీల్ ఈ దాడి చేసింది. మొదటి లక్ష్యం అమెరికాను యుద్ధంలోకి లాగడం. రెండవ లక్ష్యం ఈరాన్‌లో ఖామనేయి ప్రభుత్వాన్ని కూల్చడం. మూడవ లక్ష్యం ఈరాన్‌ను కూడా మరో సిరియాలా మార్చి ఎప్పుడు పడితే అప్పుడు వైమానిక దాడులు చేస్తూ వీరంగం వేసే అవకాశాలు సృష్టించుకోవడం. ఈ లక్ష్యాలలో ఒకే ఒక్కటి మాత్రం ఇస్రాయీల్ సాధించగలిగింది. అమెరికాను ప్రత్యక్ష యుద్ధంలోకి లాగగలిగింది. కాని అమెరికా కూడా ఈరాన్ నిబ్బరాన్ని దెబ్బతీయలేకపోయింది. ఈరాన్‌లో ప్రభుత్వాన్ని కూల్చడం సాధ్యపడలేదు. పైగా అమెరికా కూడా ఈ యుద్ధంలో దిగడం వల్ల నష్టాలున్నాయని వెంటనే వెనక్కి తగ్గింది. ఈరాన్‌ను మరో సిరియాగా మార్చాలన్న నెతన్యాహు కల నెరవేరలేదు.

హూతీలతో రాజీకి వచ్చిన అమెరికా ఇప్పుడు ఇస్రాయీల్ కోసం మరోసారి తన వ్యాపార ప్రయోజనాలను బలిపెడుతుందా అంటే అనుమానమే. నెతన్యాహు కోసం ట్రంప్ మరోసారి ఈరాన్‌తో యుద్ధానికి దిగి కొరివితో తలగోక్కుంటారా అన్నది అనుమానమే. ఎందుకంటే ఇప్పుడు ఈరాన్‌తో యుద్ధానికి దిగడమంటే పరోక్షంగా రష్యా, చైనాలపైకి కాలుదువ్వడమే. పైగా యుద్ధరంగంలో రష్యా, చైనా ఆయుధాల పరీక్షలు జరుగుతాయి. స్వయంగా ఈరాన్ మిస్సయిల్ సామర్థ్యం ప్రపంచానికి తెలుస్తుంది. ఆయుధ మార్కెటులో అమెరికాకు ఇది పెద్ద నష్టం కలిగించవచ్చు. ఇప్పటి వరకు గొప్పలు చెప్పకున్న ఐరన్ డోమ్‌ను హూతీ, హమాస్ వంటి సంస్థలే తుత్తునియలు చేసి ప్రపంచానికి చూపించారు. అమెరికా గొప్పగా చెప్పుకునే పేట్రియాట్ రక్షణ వ్యవస్థ కూడా విఫలం కావడాన్ని ప్రపంచం చూసింది. అమెరికా ఎఫ్ 35 విమానాల సామర్థ్యం కూడా ప్రపంచం చూసింది. ఈ నేపథ్యంలో ఈరాన్‌పై కాలుదువ్వడం అంటే ప్రపంచ ఆయుధ మార్కెటును రష్యా, చైనా, ఈరాన్‌లకు వదిలేయడమే అవుతుంది.

ఈ లెక్కలన్నీ నెతన్యాహు పట్టించుకోడు. ఎందుకంటే నెతన్యాహు పదవిలో కొనసాగాలంటే యుద్ధం జరుగుతూ ఉండాలి. అందువల్ల ట్రంప్ పై ఒత్తిడి తెచ్చి మరోసారి యుద్ధానికి పూనుకునే ప్రయత్నాలు చేస్తాడు. కాని ట్రంప్ సహకరిస్తాడా అంటే అనుమానమే. గాజాను స్వాధీనం చేసుకోవాలని పావులు కదుపుతున్న నెతన్యాహు అది సాధించాలంటే ఈరాన్‌పై యుద్ధం కూడా చేయాలి. ఎందుకంటే ఈరాన్ సహాయం లభించకపోతే హమాస్ కుప్పకూలవచ్చు. హమాస్ ఉన్నంత కాలం గాజాలో సాధారణ ప్రజలను చంపడం తప్ప నెతన్యాహు సాధించేది ఏదీ ఉండదు. ఇస్రాయీల్ సైన్యానికి గాజాలో నష్టాలు కూడా తప్పవు.

మరోవైపు ప్రపంచంలో పలు దేశాలపై సుంకాల యుద్ధం చేయడంలో బిజీగా ఉన్న ట్రంప్ నెతన్యాహు కోసం ఈరాన్‌తో యుద్ధానికి దిగే అవకాశాలు తక్కువే అని కొందరి అభిప్రాయం. పైగా తాను అనేక యుద్ధాలు ఆపేశానని గొప్పలు చెప్పుకునే ధోరణిలో ట్రంప్ వున్నాడు. ఆ విధంగా నోబెల్ పురస్కారం తనకే వచ్చేలా చూసుకుంటున్నాడు. నెతన్యాహు రికమండేషనుతో ఆ పురస్కారం రాదు. కాబట్టి నెతన్యాహు ఒత్తిడి చేసినా ట్రంప్ బహుశా యుద్ధానికి ఒప్పుకోకపోవచ్చు. కాని పదవిలో కొనసాగాలంటే యుద్ధం తప్ప గత్యంతరం లేని నెతన్యాహు ఈరాన్‌పై మళ్ళీ దాడి చేసినా ఆశ్చర్యం లేదు. ఈ దాడి మరోసారి జరిగితే బహుశా పశ్చిమాసియాలో బలాబలాల సమీకరణాలు పూర్తిగా మారిపోతాయి. బహుశా పాలస్తీనా సమస్యకు కూడా ఈ పరిస్థితులు పరిష్కారాన్ని చూపించవచ్చు. ✤

# వివాదాస్పద బిల్లుపై విపక్షాల ధ్వజం



-ఉమైర్

**తీవ్ర నేరారోపణలతో** అరెస్టయి వరుసగా 30 రోజులు నిర్బంధంలో ఉన్న రాష్ట్రాల ముఖ్యమంత్రులు, మంత్రులను పదవి నుంచి తప్పించే అధికారాలను గవర్నర్లు, లెఫ్టినెంట్ గవర్నర్లకు కట్టబెడుతూ కేంద్ర హోం మంత్రి అమిత్ షా బుధవారం లోక్‌సభలో వివాదాస్పద బిల్లు ప్రవేశపెట్టారు. అమిత్ షా ప్రవేశపెట్టిన బిల్లు ప్రకారం, ఐదు లేదా అంతకంటే ఎక్కువ సంవత్సరాల జైలు శిక్ష విధించదగిన నేరాలలో, నేరం రుజువు కాకపోయినా, అరెస్టై 30 రోజులు గడిచిపోతే చాలు ఏ మంత్రిని అయినా, ముఖ్యమంత్రిని అయినా పదవి నుంచి తొలగించవచ్చు. ఇది నిరంకుశమైన బిల్లు అని ప్రతిపక్షాలు ధ్వజమెత్తాయి. లోక్‌సభలో దీనిపై తీవ్ర గందరగోళం చెలరేగడంతో, ఈ బిల్లును పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీకి పంపాలని సిఫార్సు చేశారు.

ఏ కేంద్ర మంత్రి అయినా, రాష్ట్ర మంత్రి అయినా లేదా ముఖ్య మంత్రి అయినా వరుసగా 30 రోజులు అరెస్టయి నిర్బంధంలో ఉంటే, వారిని పదవి నుండి తొలగించాలని ఈ బిల్లు ప్రతిపాదిస్తుంది. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ దీనిని 'నల్ల బిల్లు'గా అభివర్ణించారు. ఈడీ, సీబీఐ నమోదు చేసిన కేసులు నకిలీ కేసులని టిఎంసీ విమర్శించడం అందరికీ తెలిసిన విషయమే. అన్నింటికన్నా ముఖ్యమైన విషయం ఈడీ, సిబిఐలు కేంద్ర ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరిస్తున్నాయనే ఆరోపణలు ఇటీవల చాలా వచ్చాయి. అవినీతి ఆరోపణలపై కేసులు ఎదుర్కొంటున్న చాలా మంది బీజేపీలో చేరిన తర్వాత ఆ కేసులేమై పోతున్నాయో ఎవరికీ తెలియదు. ఈడీ, సిబిఐ కేసులన్నీ ప్రతిపక్ష నేతలపైనే ఎక్కువగా నమోదవుతున్నాయనే విమర్శ బలంగా వస్తున్న నేపథ్యంలో ఈ కొత్త బిల్లుపై విమర్శలు మరింతగా పెరుగుతున్నాయి.

ఈ బిల్లు చర్చ సందర్భంగా కాంగ్రెస్ నాయకుడు వేణుగోపాల్ మాట్లాడుతూ హోంమంత్రి కూడా గతంలో అరెస్టయిన వారే అని గుర్తు చేసినప్పుడు అమిత్ షా ఆగ్రహంతో తాను అరెస్టు కాకముందే గుజరాత్ హోం మంత్రి పదవికి రాజీనామా చేశానని, కస్టడీలో ఉన్నప్పుడు ఏ పదవిలోనూ లేనని స్పష్టం చేశారు. అది మంచి విషయమే. అరెస్టుకు ముందే రాజీనామా చేయడం నేతలు పాటించవలసిన పద్ధతి.

దేశవ్యాప్తంగా బిహారులో ఓటర్ల తొలగింపు సమస్య చర్చనీయాంశంగా మారిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఈ బిల్లు తీసుకు రావడం ప్రాధాన్యతను సంతరించుకుంది. బీజేపీకి మద్దతిస్తున్న

నితీష్ కుమార్, చంద్రబాబు నాయుడులను నియంత్రించడానికి, వారిని బ్లాక్ మెయిల్ చేయడానికే ఈ బిల్లు తీసుకు వచ్చారని కూడా ప్రతిపక్ష సభ్యులు తీవ్రమైన ఆరోపణలు చేశారు.

రాజకీయ దురుద్దేశ్యాలతో, కక్షసాధింపులతో కేసులు పెట్టడం కొత్త కాదు. తమిళనాడు ముఖ్యమంత్రి ఈ విషయమే ప్రస్తావిస్తూ రాజకీయ ప్రత్యర్థులపై కేసులు బనాయించి గద్దె దించి ప్రభుత్వాలు పడగొట్టే కుట్ర ఈ బిల్లు వెనుక ఉందన్నారు.

కాని ఈ బిల్లు ప్రవేశపెట్టిన సమయం, నేపథ్యం, బిల్లు చట్టసభలో ఆమోదం పొందడానికి అవసరమైన బలాబలాలు అన్నింటినీ గమనిస్తే ఆసక్తికరమైన నిజాలు ముందుకు వస్తాయి. ఇది రాజ్యాంగ సవరణ బిల్లు. ఇది పాసవ్వాలంటే రెండు సభల్లో మూడింట రెండు వంతుల మెజారిటీ కావాలి. ఎన్డీయే ప్రభుత్వానికి అంత మెజారిటీ లేదు. ప్రతిపక్ష పార్టీలు కూడా మద్దతిస్తేనే చట్టమవుతుంది.

ప్రస్తుతం లోక్‌సభలో 542 మంది సభ్యులు ఉన్నారు. మూడింట రెండు వంతుల మెజారిటీ కోసం, కనీసం 361 ఓట్లు అవసరం. ఎన్డీయేకు 293 మంది బలం ఉంది. తటస్థ పార్టీలు మద్దతిచ్చినా బిల్లు పాసు కాదు. రాజ్యసభలో కూడా పరిస్థితి అదే. ఎగువ సభలో ఇప్పుడు 239 మంది సభ్యులు ఉన్నారు. మూడింట రెండు వంతుల మెజారిటీ కోసం బిల్లుకు 160 మంది మద్దతు అవసరం. ఎన్డీయేకు 132 ఓట్లు మాత్రమే ఉన్నాయి. అంటే ప్రతిపక్షం మద్దతు లేకుండా బిల్లు పార్లమెంటును దాటదు. ఒకవేళ ఏదన్నా విచిత్రం జరిగి బిల్లు ఆమోదం పొందినా ఈ బిల్లు దేశ సమాఖ్య వ్యవస్థను ప్రభావితం చేస్తుంది కాబట్టి కనీసం సగం రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ఆమోదం అవసరం. అన్నింటికీ మించి అనేక మంది ఎంపీలు ఇది ప్రాథమిక న్యాయసూత్రం 'నిర్దోషి అని నిరూపించబడే వరకు నేరస్థుడు కాదు' అనే సూత్రానికి విరుద్ధమని సుప్రీంకోర్టులో సవాలు చేయవచ్చు.

ఈ బిల్లు ఆమోదం పొందే పరిస్థితి లేదని తెలిసి కూడా బీజేపీ పార్లమెంటులో ఎందుకు గందరగోళం సృష్టించింది అనేది ఆలోచించవలసిన ప్రశ్న.

ఇన్ని అడ్డంకులు ఉన్నప్పుడు, ప్రభుత్వం ఎందుకు ఈ బిల్లు తీసుకువచ్చిందంటే... ప్రచారాస్త్రం కావాలి కాబట్టి.

బిహార్‌లోని ప్రత్యేక ఓటర్ల సవరణపై గగ్గోలు చెలరేగుతోంది. ఓట్ల దోపిడి నినాదంతో కాంగ్రెస్ ప్రజల్లోకి చొచ్చుకుపోతోంది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పై ఎదురుదెబ్బ తీయడానికి ఏదన్నా

**ఇదంతా ఒక పెద్ద ప్రచార వ్యూహంలో భాగం. ఈ బిల్లు ప్రకారం పదవి నుండి తొలగింపు కేవలం ఆరోపణల ఆధారంగానే జరగవ చ్చు. ప్రతిపక్ష పార్టీలు కొంతకాలంగా కేంద్ర దర్యాప్తు సంస్థల దుర్వినియోగం గురించి ఆరోపిస్తున్నాయి. ఇప్పుడు ఈ కొత్త చట్టం దేశాన్ని పోలీసు రాజ్యంగా మార్చేస్తుందని విమర్శిస్తున్నాయి.**

అస్త్రం కావాలి. ఇప్పుడు ఈ బిల్లు ద్వారా అలాంటి అస్త్రం ఒకటి లభిస్తుంది. ఈ చట్టానికి వ్యతిరేకంగా కాంగ్రేసు ప్రతిపక్షాలు చేసే నిరసనను బీజేపీ తనకు అనుకూలంగా ప్రచారం చేస్తుంది. అవినీతి నిరోధక బిల్లును కాంగ్రెస్ అడ్డుకుంటుందని, అవినీతికి మారుపేరు కాంగ్రెస్ అని ప్రచారం చేసుకోవచ్చు. తృణమూల్ ఎంపీ మహువా మొయిత్రా ఈ విషయం బట్టబయలు చేశారు కూడా. ప్రభుత్వానికి అవసరమైన బలం లేదని, ఓట్ల దోపిడి నుంచి ప్రజల దృష్టి మళ్ళించడానికి ఈ బిల్లు తెచ్చారని చెప్పారు.

ఇదంతా ఒక పెద్ద ప్రచార వ్యూహంలో భాగం. ఈ బిల్లు ప్రకారం పదవి నుండి తొలగింపు కేవలం ఆరోపణల ఆధారంగానే జరగవచ్చు. ప్రతిపక్ష పార్టీలు కొంతకాలంగా కేంద్ర దర్యాప్తు సంస్థల దుర్వినియోగం గురించి ఆరోపిస్తున్నాయి. ఇప్పుడు ఈ కొత్త చట్టం దేశాన్ని పోలీసు రాజ్యంగా మార్చేస్తుందని విమర్శిస్తున్నాయి.

లోక్ సభ సమావేశాలు ముగియడానికి ఒక రోజు ముందు కేంద్రం ఈ బిల్లును ప్రవేశపెట్టింది. బిల్లుల జాబితాలో దీనిని జాయింట్ పార్లమెంటరీ కమిటీకి పంపుతామని పేర్కొనడం చూస్తే ఈ బిల్లును ఆమోదింపజేసే తొందరేమీ ప్రభుత్వానికి లేదని కూడా అర్థమవుతుంది. సభాధ్యక్షుడు ఈ బిల్లును లోక్‌సభలోని 21 మంది సభ్యులు, రాజ్యసభలోని 10 మంది సభ్యులతో కూడిన ఒక ఉమ్మడి కమిటీ పరిశీలించాలని నిర్ణయించారు.

కాబట్టి ఈ బిల్లు అవినీతిని అంతం చేయడానికి కాదు. అవినీతి గత పదేళ్ళుగా ఎంత అంతమైందో ప్రజలు చూస్తూనే ఉన్నారు. ఇది ఎన్నికల రాజకీయాల్లో ఒక భాగం మాత్రమే. ✤

8/3

# తల్లిని ఒప్పించిన తనయుడు

ఎస్.ఎమ్. మలిక్

# మహనీయ సఅద్ బిన్ అబీ వక్కాస్ (రజియల్లాహు అన్హు)

## 3. ఈరాన్ విజేత!

### పొంతన లేని సేనలు

హిజ్రీ 14వ సంవత్సరం ముహర్రమ్ నెలలో ముస్లిముల కెదురుగా ఎన్నో రెట్లు అధికమయిన ఈరానీ సేన బారులు తీరి వచ్చింది. మహనీయ సఅద్ కీళ్ళ నొప్పి వల్ల నడవలేక పోతున్నారు. ఆయన ఒక కట్టడం కప్పు పైన కూర్చుని నిర్దేశాలు ఇవ్వ సాగారు. ఒక సిపాయి, 'ఖాలిద్ బిన్ అరఫ్త'ను ఆ కట్టడం క్రింద నిలిపారు. మహనీయ సఅద్ కాగితం మీద నిర్దేశన వ్రాసి దాన్ని ఉండగా చుట్టి క్రింద వేస్తే ఖాలిద్ దాన్ని తీసుకుని వేగంగా పరిగెత్తే గుర్రమెక్కి సంబంధిత అధికారు లకు అందజేసేవారు.

భీకర యుద్ధం సాగుతోంది, అంతలో గాలిబ్ బిన్ అబ్దుల్లా అసదీ అనే సిపాయి ఒక వ్యక్తిని పట్టి మహనీయ సఅద్ వద్దకు తీసుకు వచ్చాడు. ఆ సిపాయి, "అయ్యా! ఇతను సాసానీయుల (ఈరానీయుల) యువరాజుల్లో ఒకడు" అని చెప్పి యుద్ధ భూమికి తరలిపోయాడు. అంతలోనే మరో ఈరానీ శూరుడు పంక్తుల నుంచి బయటికి వచ్చి ముస్లిమ్ దళపతుల్ని ఛాలెంజ్ చేయసాగాడు. అమ్ర్ బిన్ మఅదీ కర్బ్ అతని కేక విని ఎదుర్కొనేందుకు సిద్ధమయ్యారు. ఆయన వచ్చీ రాగానే ఆ ఈరానీ వీరుణ్ణి గుర్రం మీది నుంచి ఎత్తి నేలపైన గిరాటువేశారు, ఆ తరువాత అతని రొమ్ము పైన ఎక్కి కూర్చుని కంఠం తెగేశారు!

### వీర శూర యోధులు

రాత్రి మొదలయ్యే వరకు యుద్ధం కొనసాగింది. రాత్రి అవగానే యుద్ధ విరమణ జరిగింది. తిరిగి మంగళవారం సూర్యోదయం అయిన మూడు గంటలకు యుద్ధం ప్రారంభమయింది. మహనీయ సఅద్(ర), సేనాని కా'కా'తో, "నేను నేడే యుద్ధం ముగింపును కోరుకుంటున్నాను. దైవాన్ని సహాయం కొరకు వేడుకుంటున్నాను" అన్నారు. అలాగే సాయంత్రం వరకు పేరుగన్న పర్షియా నాయకులు హత మయ్యారు. పది వేల మంది సిపాయీలు ఆ ఒక్క రోజున

హతులయ్యారు. దాదాపు అంతే మంది గాయపడ్డారు కూడా.

ముస్లిముల్లో హతులయిన వారు, గాయపడిన వారు మొత్తం ఒక వెయ్యి మంది ఉంటారు. నిజానికి ఆనాటి యుద్ధం నిర్ణయాత్మక మయినదే. ఎందుకంటే ఈరానీ బలగాలలో రక్షణాత్మక పోరుకు కూడా శక్తి లేకపోయింది. అయినా పర్షియన్ సేనకు మద్దత్తు అందుతూనే ఉంది. ఫలితంగా మూడవ రోజు రాత్రి వేళ కూడా పోరు కొనసాగింది. ఏది ఏమయినా, మహనీయ సఅద్ (ర) అత్యంత సాహసోపేతంగా తన సైనిక నైపుణ్యం కనబరిచారు. ఈరానీయుల శక్తి హరించి పోయి వారి సాహసం సన్నగిల్లింది. వారు చిత్తు చిత్తుగా ఓడిపోయారు.

మహనీయ సఅద్ బిన్ అబీ వక్కాస్(ర) రెండు నెలలు కాదిసియాలో మకాం చేసి సైనిక పటిష్ఠత నెలకొల్పడమే కాక మిగతా పరిపాలనా యంత్రాంగం ఏర్పాట్లు కూడా పూర్తి చేశారు. ఆ తరువాత సాసానీ రాజధాని, మదాయన్ వైపునకు ముందుకు సాగారు. దారిలో తటస్థించిన నగరాలను జయిస్తూపోయారు. కడకు బహ్రాషేర్ కోటకు వచ్చారు. దాన్ని ఓ ప్రత్యేక కోణంలో నిర్మించడం జరిగింది. అది ఈరానీయుల కంటోన్మెంట్. అందులోని సేన, రాజధాని మదాయన్ తోపాటు అక్కడి రాజభవనాల రక్షణ కూడా చేయగలిగేలా దాని నిర్మాణం జరిగింది. మరో విధంగా అది ఈరానీయుల రక్షణ కోట గోడ!

## విజయ పరంపర

మహనీయ సఅద్ (ర) నేతృత్వంలో సేన బహ్రాషేర్ కంటోన్మెంట్‌ని చుట్టుముట్టింది. అప్పుడప్పుడు ఈరానీ సైనికులు బయటికి వచ్చి పోరు సలిపి వెళ్ళిపోయేవారు. ఒక రోజు సేన బయటకు వచ్చి పూర్తి శక్తితో పోరాడినా ఇస్లామీయ సేనకు పెద్ద హాని కలిగించ లేకపోయింది. ఆ తరువాత ఈరానీ సేన కోటలో బందీ అయిపోయింది. రాయబారి ద్వారా విధేయతకు అంగీకరించారు ఈరానీయులు. దాంతో ముస్లిములు నగరంలోకి ప్రవేశించారు. అక్కడి నుంచి దజ్లానదీ ఆవలి ఒడ్డున మదాయన్‌లోని శ్వేత రాజభవనం స్పష్టంగా కానవచ్చింది.

ఈరాన్ చక్రవర్తి నివసించే రాజభవనం చూడగానే ముస్లిములు "అల్లాహు అక్బర్" అని దేవుని గొప్పతనం నినదించారు. తమ కమాండర్ ఇన్ చీఫ్ వైపునకు చూసి, "ఇదో కిస్రా శ్వేత భవంతి కానవస్తోంది, అల్లాహ్ చేసిన వాగ్దానం ఇదే!" అన్నారు. మదాయన్‌లోని కంటోన్మెంట్‌లోనే మహనీయ సఅద్(ర) ఈరానీయులతో ఒప్పందం చేసుకున్నారు. అయితే ఆ మధ్యన తెలిసింది, చక్రవర్తి యజ్ద్ గర్ద్ రాజధాని నుంచి ఖజానాలు తరలిస్తున్నాడని. మహనీయ సఅద్(ర) త్వరగా మదాయన్ వైపునకు పురోగమించాలని సంకల్పించుకున్నారు. బహ్రాషేర్‌కూ మదాయన్‌కు మధ్యన దజ్లానదీ ఉంది. ఈరానీయులు ముందే వంతెన పడగొట్టారు. అప్పుడు ఆయన(ర)సేనను సంబోధించి ఓ ప్రసంగం చేశారు. అది క్లుప్తంగా :

> *"దైవ భక్తుల్లారా! ధర్మ సైనికులారా!! అగ్ని పూజారులయిన సాసానీయులు సామాన్య మానవుల్ని, దేవుని దాసుల్ని లోబరచుకుని, వారికి అబద్ధపు మాటలు చెప్పి బలవంతాన సూర్యుని ఆరాధన, అగ్ని పూజ చేయించారు. వారి కష్టార్జితంతో తమ బొక్కసాలు నింపుకున్నారు. ఇప్పుడు మీరు ఆ ప్రజల విముక్తి కొరకు వస్తే పరారవుతున్నారు. పేదల సొమ్మును తమ గుర్రాల పైన, కంచర గాడిదల పైన ఎక్కించుకుంటున్నారు. మనం వారిని ఇలా చెయ్యనివ్వరాదు. వారు ఈ నదీ పైని వంతెనను ముందే పడగొట్టారు. వారికి తెలియదు, దేవునిపై భారం మోపే వారు వంతెనలు, పడవలను నమ్మి ఏదీ చెయ్యరు. నేను ప్రథమంగా నా గుర్రాన్ని నదిలో పోనిస్తాను. మీరున్నూ అలాగే చేయండి. ఒకరికొకరు సహాయంగా దజ్లానదిని దాటి వేయండి. దైవం మీకు సహాయపడు గాక! మిమ్మల్ని రక్షించుగాక!!"*

## నదిలో దౌడు తీసిన గుర్రాలు

దజ్లానదీ ఒడ్డునే మదాయన్ ఉండటం వల్ల నదీని దాటడం అనివార్యమయింది. తొలుత మహనీయ సఅద్ తన గుర్రాన్ని 'బిస్మిల్లాహ్' అంటూ నదిలోకి దించారు. తమ నాయకుణ్ణి చూసి సైనికులంతా అదే చేశారు. దజ్లానదీ భీకర అలలు అడ్డు రాలేదు, దైవ దాసుల సేన, పంక్తుల క్రమం కూడా ఏ మాత్రం చెడకుండా దాటి వచ్చేసింది. ఆవలి వైపున నిలబడి చూస్తున్న ఈరానీ సైన్యం కళ్ళు చెదిరిపోయాయి. వారు భీతిల్లి అప్రయత్నంగా కేకలు వేయ సాగారు:

'దయ్యాలు వస్తున్నాయి! దయ్యాలు వస్తున్నాయి!!' అని!

పర్షియన్ సేనకు ముస్లిములతో జరిగిన పోరాటాల అనుభవం, ప్రస్తుత దృశ్యం చూసిన తరువాత ముస్లిములను ఎదిరించే సాహసం ఎలా కలుగుతుంది? కనుక కొంత మంది సిపాయిలు యజ్ద్ గర్ద్ ను, రాచ కుటుంబాన్ని తీసుకుని హల్వాన్ వైపునకు పరుగులు తీసారు. మిగతా సైన్యం, రాజ్య

యంత్రాంగం జిజ్యా కట్టడానికి ఒప్పుకున్నారు. మదాయన్‌లో తివాచీలు, బట్టలు, జరీ పని చేసిన బట్టల తానులు, వెండి బంగారు అసంఖ్యాక పాత్రలు, లెక్క లేనంత అలంకార సామగ్రి ప్రాప్తమయింది. ఇంకా రాజ్య ఖజానాలో, ఒక్కొక్క దానిలో ఒకటిన్నర మణుగుల బంగారం నిండిన, మూడు వేల గోవు చర్మాలు లభించాయి.

## రాచరిక వ్యసనాలు

మహనీయ సఅద్(ర)శ్వేత భవనంలో ప్రవేశించినప్పుడు ఒక్క ప్రాణీ కానరాలేదు. మూల మూలన ఓ భయంకర నిశ్శబ్దత ఆవహించి ఓ చిరస్మరణీయ గుణపాఠం కలగజేస్తోంది! ఆయన నోట అసంకల్పితంగా దైవవాణి వచనాలు వెలువడ్డాయి

> **ఎన్నో తోటలు, నీటి చలమలు, పొలాలు ఇంకా మహా గొప్ప భవంతులు వారు వదలి వెళ్ళిపోయారు. ఎన్నెన్నో భోగ విలాసాల సిరిసంపదలలో వారు మజాలు జుర్రుకునేవారు, వారి తరువాత (అవన్నీ) యథాతథంగా ఉండిపోయాయి. వారి అంతం ఇలా కాగా మేము ఇతరుల్ని ఆ సామగ్రికి వారసులుగా చేశాము. (అద్ దుఖాన్ 44: 25 - 28)**

ఆ తరువాత మహనీయ సఅద్ (ర) ఎనిమిది రక'తులు సలాతుల్ ఫతహ్ (విజయ నమాజ్ ) చేసుకున్నారు. ఆ పైన ఆయన ఓ ప్రకటన చేయించారు, 'జుమా నమాజ్ కూడా శ్వేత భవనంలోనే చేయబడుతుంది' అని. పిమ్మట మధ్యాహ్నం వరకు జుమా ప్రసంగం కొరకు మింబర్ కూడా ఏర్పాటు చేశారు. పర్షియా దేశంలో మొదటి జుమా నమాజ్ చేయడం జరిగింది. మహనీయ సఅద్ బిన్ అబీ వక్కాస్(ర), అమ్ర్ బిన్ మక్రన్(ర)ని రాచ సామగ్రి ఓ చోట ప్రోగు చేయ డానికి, సులైమాన్ బిన్ రబీఅ బాహిలీ(ర)ని దాన్ని పంచిపెట్ట డానికి నియమించారు.

## వ్యర్థమయిన విలాస సామగ్రి

ఇస్లామీయ సైనికులు సాయంత్రం వరకు యుద్ధ ప్రాప్తిగా దొరికిన సామగ్రి అంతా ఇబ్ను మక్రన్ వద్ద ప్రోగు చేశారు. దాని పట్టిక చాలా నిడువయినది. శతాబ్దాలుగా చక్రవర్తులు ప్రోగుజేసిన సొమ్ము ఎంత ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. యుద్ధ ప్రాప్తిలో నుంచి ఖుముస్ (అయిదవ వంతు), ఈరానీ యుల కరవాలాలు, నౌషర్వాన్ కిరీటం, జరీ పని చేసిన రాచ కుటుంబ వస్త్రాలు, ప్రాచీన స్మరణీయ వస్తు సామగ్రి, ఒక అపురూపమయిన, పూలూ తీగలు మణి మాణిక్యాల ఖచితమయిన తివాచీ, (దాని సైజు 180' X 180' అడుగులు), ఇత్యాది వన్నీ ఖిలాఫత్ కేంద్రం, రాజధానికి పంపడం జరిగింది.

కొందరు సహచర మాన్యులు మహనీయ ఉమర్ (ర)కు సలహా ఇచ్చారు, ఆ తివాచీని చారిత్రక స్మరణీయంగా అట్టే పెట్టమని. కాని మహనీయ ఉమర్ (ర) దాన్ని కొన్ని ముక్క లుగా చేసి పంచి పెట్టారు. ఈ తివాచీ పట్ల నిర్వహించిన విధానం ద్వారా తెలుస్తోంది, ఇస్లామ్ ఇటువంటి వ్యర్థమయిన, ఉద్దేశ రహితమయిన అలంకరణల్ని ఎంత విలువ లేనివిగా పరిగణిస్తుందో! మహనీయ అలీ (ర) వాటాలో తక్కువ పనితనమున్న ముక్క వచ్చింది. అది కూడా ముప్పై వేలకు అమ్ముడుపోయింది! ✤


**చందాదారులకు విజ్ఞప్తి**

చాలామంది పాఠకులు తమ చందా సొమ్మును బ్యాంక్ ఆన్‌లైన్ ద్వారా చెల్లిస్తున్నారు. ఇలా చందా చెల్లించిన వారు తమ పూర్తి అడ్రసు, ఫోన్ నెంబరు లేదా సెల్ నెంబరుతో సహా ఉత్తరం ద్వారా గానీ లేదా ఫోన్ ద్వారా గానీ తెలియజేయాలని మనవి.

**వివరాలకు సర్క్యులేషన్ మేనేజర్‌కు ఫోన్ చేయండి : 9704317015**

ఆన్‌లైన్ ద్వారా డబ్బులు పంపినవారు ఈ నెంబరుకు **Screen Shot** పంపి **9989903850** ఫోన్ చేయండి.

**Bank Details**

**Geeturai Weekly**
**Account No:1042789768**
Bank: **Central Bank of India**
Noorkhan Bazar Branch,
**IFSC Code. CBIN0282407**
**Hyderabad- 500 002, Telangana**

Office Address: **Geeturai Weekly**
**Sandesha Bhavanam, Lakkadkot, Chatta Bazar**
**Hyderabad-02. Email:geeturaiweekly@gmail.com**




**లక్ష్మణ్ గౌడ్, 9704930509**
-క్యాన్సస్,యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా

సనాతన వైభవోపేత సాంస్కృతిక
సంస్కార సౌందర్యం
గజదొంగల వీర విహారంలో
పతనమైన పరమోన్నత దివ్యభారతం

'విశ్వగురు' బిరుదాంకిత ఘనకీర్తి
మతమౌఢ్యం చెలరేగి మారణ హోమం,
బలి తీసుకున్న జనజీవనం!

ఉపనిషత్ ఉషస్సుల జ్ఞాన సౌరభం
విశ్వమంతా వెలిగించిన వాంగ్మయ భారతం
అజ్ఞానాంధకారంలో విలపించే
అమానవీయ అకృత్యాల నిలయం

గగనతలాన్ని సోకే ఆకాశ హర్మ్యాలు–
భూతలంపై నిలువ నీడ లేక
దీనుల ఆర్తనాదాలు–
ధర్మం నాలుగు పాదాల నడిచే
ఆదర్శ భారతం!!

నోట్ల కట్టల్లో మలినమైన
న్యాయదేవత విషన్న వదనం
సర్వ మానవాళి శాంతి సందేశ
మంత్రోపదేశం నా జాతి ప్రాభవం

ఘర్షణ కొలిమిలో మండే అగ్ని కీలల నిలయం
రాజ్యాంగ పీఠిక ప్రవచిత పరమోన్నత లక్ష్యాలు
సొమ్మసిల్లి నిద్రిస్తూ సాకారం నోచుకోని
సుందర స్వప్నాలు
రాజ్య పాలన ఆధారపీఠమైన రాజకీయం
అరాచక పాలనలో
కలుషితమైన ప్రజాస్వామ్య పీఠాలు

ఓటు శిలా శాసనమై ప్రజాస్వామ్యంలో
వెలుగులీను భారతం
నడి రోడ్డుపై ఓటు వేలం పాట–

నడ్డి విరిగిన ప్రజాస్వామ్యం
గ్రామ స్వరాజ్యం గాంధీ కలగన్న
అభ్యుదయ భారతం–
బ్రాందీ, విస్కీల బార్లలో నర్తిస్తున్న నవతరం–
శాస్త్ర సాంకేతిక ప్రజ్ఞ పురోగమన అన్వేషణలు
సైబర్ నేరాల విషవలయాల తిరోగమనం!

నేడు–
పరాధీనత పటాపంచలై
వేన వేల ప్రగతి దారులు–
భరతభూమి మెడలో
మణిహారాలైన వేళ
వికసించి మానవీయత ఆవహించిన
దిశానిర్దేశ పథికులు
శాంతి కపోతాలెగరేసే
సౌజన్యమూర్తులు
భారతావని విశ్వగురువై
'మూర్తిభవం'

***(79వ స్వతంత్ర దినోత్సవ సందర్భం)***




# మీ ప్రతిభకు గుర్తింపు లేనిచోట ఉండకండి

డా. ముహమ్మద్ హసన్ *అసిస్టెంట్ ప్రొఫెసర్*

**మీరు ఎక్కడో ఓ చోట పెద్దదో,** చిన్నదో ఉద్యోగం చేస్తున్నారు. మీరు ఎంతటి ప్రతిభావంతులైనా కొత్తగా వస్తున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోలేకపోతే మిమ్మల్ని వదిలించుకోవాలని మీ పైఅధికారి ప్రయత్నం చేస్తాడు. అలా అని మీరు అక్కడే ఉండాలని చూస్తే మిమ్మల్ని గెంటేసినా ఆశ్చర్య పోనవసరంలేదు. మీ ఉద్యోగం పట్ల మీకు ఎంతటి నిబద్ధత, అంకిత భావం, నైపుణ్యం వున్నా మారుతున్న కాలానికి అనుగుణంగా మీ వైఖరులు, అలవాట్లు మార్చుకోకపోతే మిమ్మల్ని ఖచ్చితంగా ఉద్యోగం నుండి తొలగిస్తారు. వారు తొలగించేలోగా మీరు హుందాగా అక్కడి నుండి బయటపడి మీ గౌరవాన్ని కాపాడుకొని మరోచోట ఉద్యోగంలో చేరటం ఉత్తమం. లేనిపక్షంలో ఏం జరుగుతుందో ఈ చిన్న కథను చదవండి.

ఒక కిరాణా షాపువాడు తన షాపు కట్టేసే సమయంలో అక్కడికి ఒక "కుక్క" వచ్చింది. దాని నోట్లో కిరాణా సామాను చిట్టి, డబ్బులు ఉన్నాయి. అది చూసిన షాపు యజమాని ఆశ్చర్యపోతూ ఆ సరుకుల లిస్టు తీసుకొని వాటన్నింటినీ ఒక సంచిలో ప్యాక్ చేసి ఇస్తాడు. ఆ సంచిని నోట్లో పెట్టుకొని కుక్క మళ్ళీ పరుగెత్తడం ప్రారంభించింది. అది చూసిన షాపు యజమాని అసలు ఆ కుక్క ఎక్కడికి వెళ్తుందోనని దానిని అనుసరిస్తాడు. కుక్క చక్కగా, క్రమశిక్షణతో వెళ్తు రోడ్డుదాటే క్రమంలో ట్రాఫిక్ సిగ్నల్ "రెడ్ లైట్"ను చూసి ఆగుతుంది. "గ్రీన్ సిగ్నల్" పడగానే మళ్ళీ రోడ్డు దాటుతుంది. బస్ స్టాప్ దగ్గరికి వెళ్ళి తను ఎక్కాల్సిన బస్సు వచ్చే వరకు నిరీక్షించి ఆ నెంబర్ బస్సురాగానే ఎక్కుతుంది. షాపువాడు ఇదంతా గమనిస్తూ ఇంకాస్త ఆశ్చర్యపోతాడు. తీరా బస్ స్టాప్ వద్ద బస్సు ఆగగానే దిగి తన ఇంటికి వెళ్ళి తను తీసుకొని వచ్చిన కిరాణ సంచిని మెట్ల దగ్గర పెట్టి తనకాలితో కాలింగ్ బెల్ నొక్కింది. ఇంట్లో నుండి ఎలాంటి స్పందన లేకపోవడంతో పక్కన వున్న కిటికీ వద్దకు వెళ్ళి లోపలికి చూసి మళ్ళీ వచ్చి రెండోసారి "కాలింగ్ బెల్" కొట్టింది. బెల్ శబ్దానికి నిద్రమత్తులో వున్న యజమాని వచ్చి తలుపు తీసి కాలుతో కుక్కను రెండుసార్లు బలంగా తన్నుతాడు. అది చూసిన షాపు అతను "షాక్"కు గురై ఏంటి మీకైమైనా "పిచ్చా" మీ దగ్గర పనిచేసే కుక్క ఇంత విశ్వాసంతో కిరాణ సామాను తెస్తే తన్నుతావా అంటూ మందలిస్తాడు.

దానికి సమాధానంగా ఇంటి యజమాని ఇది ఈ వారంలో రెండోసారి


"తప్పు" చేసింది. వెళ్ళేటప్పుడు ఇంటి తాళాలు తీసుకొని వెళ్ళొచ్చు కదా. వెళ్ళలేదు తన "కుక్క బుద్ధి" చూపించింది అంటూ షాపు అతడికి సమాధానం చెప్తాడు. దానికి షాపు ఓనర్ మీకే మైనా మతిపోయిందా, ఇలాంటి కుక్క సినిమా నిర్మాతల వద్ద, కోటీశ్వరుల వద్ద వుంటే దాని విలువ పెరుగుతుంది. దీనివల్ల మీరు డబ్బులు కూడా సంపాదించుకోవచ్చు అలాంటి దాన్ని కొడతారా అంటాడు. దానికి యజమాని, ఈ కుక్క వల్ల ఎలాంటి ఉపయోగం లేదు. ఇది నేను చెప్పినట్లు వినట్లేదు. చెప్పిన పని ఏ రోజూ సక్రమంగా చేయట్లేదని కుక్కను వదిలించుకొని లోపలి కెళ్ళి తలుపు వేసుకున్నాడు.

చూశారా! దీన్నిబట్టి మీకు ఏం అర్థమైందో ఓసారి ఆలోచించండి. మీకు గుర్తింపు లేనిచోట, అది మీ బంధువులు కావొచ్చు లేదా మీ యజమాని కావొచ్చు, మీ ఆఫీస్/ మీ చుట్టు పక్కల పరిస రాలు ఏవైనా కావొచ్చు. మీ స్నేహితులకు మీరు ఎంతగా మేలు చేసినా వాళ్ళు ఏదో ఒక రోజు అర్థం చేసుకోకుండా, పైగా మీ విలువను తక్కువచేసి అవమానకరంగా ప్రవర్తిస్తే, అలాంటి చోట మీరు ఎక్కువ కాలం వుంటే మీ విలువను మీరు కోల్పోయి నట్లే. కాబట్టి అలాంటి చోట వుండే ప్రయత్నం ఎంత మాత్రం చేయకూడదు. ఒకటి మాత్రం బాగా గుర్తుపెట్టుకోండి మీ పైఅధికారికి మీరు గనుక నచ్చలేదు అంటే మీ దగ్గర ఎన్ని తెలివితేటలు ఉన్నా అవి వృధానే. ఇక్కడ కుక్కకి చాలా తెలివి తేటలు ఉన్నాయి. అది షాపువాడు గుర్తించాడు. కానీ దాని "యజమాని" గుర్తించలేకపోయాడు. అది అతడి దౌర్భాగ్యం. పైగా ఆ కుక్క కూడా వద్దన్నా అతడి వద్దనే ఉండటానికి ఇష్టపడు తుంది. కొన్ని సందర్భాల్లో మనం కూడా ఇలాగే ప్రవర్తిస్తూ ఉంటాం. మీ పై వారు అధికారి కావొచ్చు, దగ్గరి బంధువులు కావొచ్చు, స్నేహితులు కావొచ్చు మిమ్మల్ని వదిలించుకోవాలని చూస్తే వెంటనే అక్కడి నుండి వెళ్ళిపోండి. కానీ మీ అవసరం లేని చోట మాత్రం ఉండే ప్రయత్నం చేసి మీ విలువను తగ్గించుకోకండి. అందుకే అవసరం వున్నచోట మీరుంటే మీ "విలువ" పెరుగుతుంది. అవసరం లేని చోట మీరుంటే మీ విలువ తగ్గుతుంది. "వెన్నెల" ఊర్లో కాస్తే అందరూ ఆస్వాది స్తారు. అదే అడవిలో కాస్తే నిష్ప్రయోజనం. మీరు కూడా అలాగే వుండండి. ✤

# దానం చేసిందే 'అసలైన' సంపద !

**'మంచి మార్గంలో** మీరు ఖర్చు చేసే ధనం మీకే మేలు చేకూరుస్తుంది. అసలు మీరు ఖర్చు చేసేది అల్లాహ్ ప్రసన్నత పొందటానికే కదా! మంచి మార్గంలో మీరేమి ఖర్చు చేసినా దాని ప్రతిఫలం మీకు పూర్తిగా లభిస్తుంది. మీకు అన్యాయం ఎంత మాత్రం జరగదు' అని దివ్య ఖురాన్ లో అల్లాహ్ సెలవిచ్చాడు. కేవలం దైవ ప్రసన్నతను దృష్టిలో ఉంచుకొనే దాన ధర్మాలు చేయాలి. పేరు ప్రఖ్యాతుల కోసం ధనాన్ని ఖర్చు చేస్తే ఎలాంటి ప్రయోజనం ఉండదు. పైగా అది దైవాగ్రహానికి కారణం కావొచ్చు. 'మనిషి దాన ధర్మాలు చేసిన ధనమే అతడి ఖాతాలో జమ అయి ఉంటుంది. అతడు వదిలిపెట్టి పోయే ధనమంతా అతడి వారసులదే' అని దైవ ప్రవక్త (సల్లం) తెలిపారు. ఒక్క ఖర్జూర పండు ముక్కను దానం చేసైనా నరకాగ్ని బారి నుంచి కాపాడుకో వాలని ఆయన ఉపదేశించారు. 'ఇస్లాంలో అన్నింటికన్నా శ్రేష్ఠమైన ఆచరణ ఏది' అని ఓ వ్యక్తి దైవ ప్రవక్త (సల్లం)ను అడిగి నప్పుడు ఆయన 'ప్రజలకు అన్నం తినిపించు' అని అన్న దానం గొప్పతనం గురించి చెప్పారు. దుస్తులు అవసరమైన వారికి వస్త్రదానం, రోగులకు చికిత్స చేయడం, బాకీదారుల రుణం తీర్చడం కూడా పుణ్య కార్యాలే. దాన ధర్మాల వల్ల కొన్నిసార్లు ఇహ లోకంలోనే రెట్టింపు ప్రతిఫలం లభిస్తుంది. అల్లాహ్ మాత్రం పవిత్ర సంపాదన నుంచి ఇచ్చే దానాలనే స్వీకరిస్తాడు. ఆ దానాలను కొండంత పెంచి తిరిగి దాతకే అందిస్తాడు. దాన ధర్మాల వల్ల ఆపదలు తొలగిపోయి, మన సంపదకు దేవుడి నుంచి రక్షణ లభిస్తుంది. అందువల్ల ఇహ, పర లోకాల్లో తనకు లాభాన్ని చేకూర్చే విధంగా మనిషి తన దగ్గరున్న ధనాన్ని వీలైనంత ఎక్కువగా దాన ధర్మాలు చేస్తూ ఉండాలి.

**– షేక్ హసీనా**




**యండి. ఉస్మాన్ ఖాన్, సీనియర్ జర్నలిస్ట్**

తెలంగాణలో ఇటీవలి రోజుల్లో 'మార్వాడీ కల్చర్ గో బ్యాక్', 'గుజరాతీ గో బ్యాక్' వంటి నినాదాలు, సామాజిక మాధ్యమాల్లో విస్తరిస్తున్న వీడియోలు తీవ్రమైన ఆందోళనకు కారణమవుతున్నాయి. హైదరాబాదులోని మోండా మార్కెట్‌లో చోటుచేసుకున్న ఘర్షణలో, ఒక దళిత యువకుడిని కులం పేరుతో దూషిస్తూ మార్వాడీలు జరిపిన మూకుమ్మడి దాడి, దానికి అడ్డొచ్చిన మరో ఇద్దరు బీసీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తులపై కూడా దాడి జరిపిన ఘటన, రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. వీడియోలు సోషల్ మీడియాలో పాకి, కొన్ని వర్గాలలో ప్రాంతీయ భావోద్వేగాలు చెలరేగాయి.

నిజానికి మోండా మార్కెట్‌లోని ఈ గొడవ ఒక వ్యక్తిగత ఘర్షణగా మొదలైంది, కానీ దానికి ప్రాంతీయత, ఆధిపత్యం, జాతి కోణం తోడవడం వల్ల సమస్యకు కొత్త రూపం ఏర్పడింది. వీడియోలలో కనిపించిన దృశ్యాలు, దళిత యువకుడిపై దాడి, అతనికి సహాయంగా వచ్చిన వారిపై దాడి, సహజంగానే ప్రజల్లో ఆగ్రహం రేపాయి. ఈ ఆగ్రహం సామాజిక మాధ్యమాలలో 'మార్వాడీ గో బ్యాక్', 'గుజరాతీ గో బ్యాక్' వంటి నినాదాల రూపంలో ప్రతిబింబించింది.

భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి దేశంలో ఎక్కడైనా నివసించే, వ్యాపారం చేసుకునే, జీవనోపాధి పొందే హక్కును కల్పించింది. తెలంగాణలో మార్వాడీలు, రాజస్థానీలు, గుజరాతీలు శతాబ్దానికి పైగా ఉంటున్నారు. నిజాం కాలం నుంచే వారు హైదరాబాద్‌లో వ్యాపారాలు చేసుకుంటున్నారు. పాతబస్తీ బజార్ల నుండి కూకట్‌పల్లి హోల్‌సేల్ మార్కెట్ల వరకు, వాణిజ్య రంగంలో వారు విస్తరిం చారు. ప్రస్తుతం తెలంగాణలోని ప్రతి గ్రామంలో పాతుకు పోయారు.

కానీ ఈ సహజీవన ప్రయాణంలో కొన్ని సార్లు విరుద్ధ భావనలు తలెత్తుతాయి. ముఖ్యంగా కుల, వ్యాపార ఆధిపత్యం లేదా

ప్రాంతీయ గౌరవం వంటి అంశాలు కలిసివస్తే సమస్యలు ముదురుతాయి. స్థానిక తెలంగాణ సమాజం కూడా తన భూమి, సంస్కృతి, సంప్రదాయాల గౌరవం కాపాడుకోవాలనే సహజ హక్కు కలిగి ఉంది. 'ఎవరైనా ఇక్కడ నివసించవచ్చు, కానీ ఇక్కడి సంస్కృతిని గౌరవించాలి'. ఈ భావన సర్వసాధారణం. ఈ రెండు వాస్తవాలను విస్మరించడం సమస్యలకు దారితీస్తోంది.

## ప్రాంతీయ స్వాభిమాన కోణం

తెలంగాణ సమాజం స్వయానా తెలుగు వారైన ఆంధ్రా పెత్తనాన్ని కూడా సహించక, దశాబ్దాల పోరాటం చేసి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించుకుంది. అప్పుడు ఆ పోరాటానికి భా.జ.పా సహా అనేక పార్టీలు మద్దతు ఇచ్చాయి. అయితే ఇప్పుడు అదే భా.జ.పా, మార్వాడీ, గుజరాతీ ఆధిపత్యానికి వ్యతిరేకంగా వచ్చే స్వరాలను పట్టించుకోకుండా, వారికే మద్దతుగా నిలబడటం ద్వంద్వ నీతి అనిపించుకోదా? ఈ ప్రశ్న సహజంగానే తెలంగాణ సమాజం మనసులో తలెత్తుతోంది.

అదే సమయంలో ఈ మార్వాడీలు, గుజరాతీల వల్ల తెలంగాణ సంస్కృతి మాత్రమే కాకుండా, ఇక్కడి వృత్తులు, వ్యాపారాలు కూడా ధ్వంసమయ్యాయని, అన్ని రంగాలలో మార్వాడీల గుత్తాధిపత్యం పెరిగిపోయిందని ప్రజలు బలంగా నమ్ముతు న్నారు. ఆంధ్రా పెత్తనానికి వ్యతిరేకంగా తెలంగాణ ఆత్మ గౌరవం కోసం ఉద్యమించి ప్రత్యేక రాష్ట్రం సాధించుకుంటే, మళ్ళీ మరో రూపంలో మార్వాడీల ఆధిపత్యం కిందికి పోవలసిన పరిస్థితులు దాపురిస్తున్నాయని తెలంగాణ వాదులు భయపడుతున్నారు.

ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో సాధ్యమైనంతవరకు సమస్యను చట్టపరమైన మార్గంలో పరిష్క రించుకోవాలి. ఇరు వర్గాలూ సామాజిక మాధ్యమాల్లో ద్వేషాన్ని రెచ్చగొట్టే పదజాల ప్రయోగాలకు దూరంగా ఉండాలి. ప్రజల్లో అవగాహన పెంచాలి. వ్యాపార మోసాలు, తప్పుడు బరువులు, నాణ్యతలేని సరుకుల గురించి స్పష్టమైన సమాచారం అందిం చాలి. సోషల్ మీడియా, సంఘాల ద్వారా ఈ చైతన్యం మరింత విస్తరించాలి.

చరిత్ర చెబుతున్నదేమిటంటే, ప్రాంతీయ భావోద్వేగాలు అదుపు తప్పితే సామాజిక సుస్థిరత క్షీణిస్తుంది. 1980ల్లో అస్సాంలో 'ఫారినర్స్ గో బ్యాక్' నినాదంతో అస్సాం గణపరిషత్ చేపట్టిన 'ఆందోళన' శృతిమించి రాగాన పడింది. ఒక్క 'నెల్లీ'లోనే రాత్రికి రాత్రి ఒక వర్గానికి చెందిన మూడువేల మందిని ఊచకోత కోసారు. ఆ గాయాలు ఇప్పటికీ మానలేదు. 2000ల్లో ముంబైలో ఉత్తర భారతీయులపై దాడులు, ఇవన్నీ వ్యక్తిగత లేదా చిన్న సంఘటనలతో మొదలై, చివరికి ఆర్థిక వ్యవస్థను, సామాజిక వాతావరణాన్ని దెబ్బతీశాయి. ఈ పాఠాలు గుర్తు పెట్టుకుని, తెలంగాణలో కూడా ఇలాంటిది పునరావృతం కాకుండా జాగ్రత్త పడాలి.

ఒక సంఘటనను ఆధారంగా చేసుకుని ఒక సముదాయం మొత్తాన్ని లక్ష్యంగా చేసుకోవడం న్యాయం కాదు.

తెలంగాణ చరిత్రపరంగా ఆతిథ్య భావానికి పేరుపొందింది. కానీ ఆ ఆతిథ్యం దోపిడీకి, ఆధిపత్యానికి లైసెన్స్ కాదని అందరూ అర్థం చేసుకోవాలి. మార్వాడీలు, గుజరాతీలు వ్యాపారంలో సాధించిన విజయాలు యాదృచ్ఛికం కాదు, అది పథకం, పద్ధతి, కష్టపడి పనిచేసే స్వభావ ఫలితం. తెలంగాణ యువత కూడా అదే స్థాయిలో నైపుణ్యాలు పెంపొందించుకుని, స్థానిక వ్యాపార నెట్‌వర్క్‌ను బలోపేతం చేసుకోవాలి. మార్కెట్‌లో పోటీ పుట్టుకపై ఆధారపడి ఉండదు, శ్రమ, పట్టుదల, సృజనాత్మకతపై ఆధారపడి ఉంటుంది.

ఎవరైనా ఎక్కడివారైనా చట్టవిరుద్ధమైన లేదా మోసపూరిత కార్యకలాపాలు చేస్తే, వాటిని బట్టబయలు చేయాలి. ప్రజలకు నాణ్యత, సరైన బరువు, సరైన ధరలపై అవగాహన కల్పించాలి. అదేవిధంగా మార్వాడీలు, గుజరాతీలు కూడా స్థానిక సంస్కృతి, భాష, సామాజిక పద్ధతులను గౌరవించాలి. వ్యాపారంలో న్యాయం, వినయం పాటించాలి. ఘర్షణలకు దారి తీసే ప్రవర్తన ముమ్మాటికీ గర్హనీయం. ఈ గడ్డపై నివసిస్తూ, ఇక్కడ వ్యాపారాలు నిర్వహించుకుంటూ ఇక్కడి సంపదను మరో ప్రాంతానికి తరలించుకుపోవడం కూడా సమంజసం కాదు.

## ఆర్థిక, సామాజిక ప్రభావం

ప్రాంతీయ విభేదాలు పెరిగితే పెట్టుబడులు తగ్గుతాయి, వాణిజ్యం మందగిస్తుంది, పర్యాటకం దెబ్బతింటుంది. హైదరాబాద్ వంటి ప్రపంచస్థాయి నగరానికి ఇది భారీ నష్టం. తెలంగాణ ఒక బహుళ సాంస్కృతిక సమాజం. బజార్లలో పక్కపక్కనే తెలంగాణ భాషలో బేరమాడే వ్యాపారి, హిందీలో పలకరించే మార్వాడీ వ్యాపారి ఉంటారు. ఈ విభిన్నతే మన బలం. ఈ బలాన్ని వైషమ్యంతో కాదు, ప్రేమతో కాపాడుకోవాలి. ప్రస్తుతం మనకు కావలసింది 'గో బ్యాక్' నినాదాలు కాదు, 'ఫెయిర్ ప్లే' డిమాండ్లు, అడ్డుగోడలు కాదు, సమాన అవకాశాల పూల వంతెనలు. ఇది తెలంగాణ భవిష్యత్తును నిర్ణయించే మలుపు.

అపార కృపాశీలుడు పరమ కరుణామయుడు అల్లాహ్ పేరుతో

తఫ్‌హీముల్ ఖుర్‌ఆన్: మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూది ఖుర్‌ఆన్ అవగాహనం: ఎస్.ఎమ్. మలిక్

35 ఆయత్‌లు

# 46. అల్ అహ్కాఫ్

మక్కా అవతరణ

27 – 28 మీ చుట్టుపట్ల ఉన్న ప్రాంతాల్లో అనేక జనావాసాలను మేము సంహరించాము. మేము మా వచనాలను పంపి మాటి మాటికీ రకరకాలుగా వారికి బోధపరిచాము, వారు మానుకుంటారేమోనని. అలాంటప్పుడు, అల్లాహ్‌ను వదలి వారు, అల్లాహ్ సాన్నిహిత్యానికి మార్గమని భావిస్తూ ఆరాధ్యులుగా చేసుకున్న అస్తిత్వాలన్నీ అప్పుడు వారికి ఎందుకు సహాయపడలేదు?[32] నిజానికి అవయితే వారికి దూరమయ్యాయి; ఇదీ వారు సృష్టించుకున్న వారి అబద్ధానికీ, కాల్పనిక విశ్వాసాలకూ పరిణామ ఫలం.

29. (ఆ సంఘటన కూడా ప్రస్తావించదగినదే) అప్పుడు మేము జిన్నుల ఒక వర్గాన్ని నీ వైపునకు తీసుకు వచ్చాము, వారు ఖుర్‌ఆన్ వినాలని.[33] (నీవు ఖుర్‌ఆన్ పారాయణం చేస్తున్న) ఆ చోటికి వారు చేరుకున్నప్పుడు వారు పరస్పరం అనుకున్నారు, నిశ్శబ్దంగా ఉండండి అని. తరువాత పఠనం ముగిసినప్పుడు వారు హెచ్చరిక చేసేవారయి తమ జాతి వద్దకు తిరిగి వెళ్ళారు.

32. అంటే, ఆ అస్తిత్వాలు ప్రారంభంలో దేవుని ఆమోదం పొందిన దాసులన్న భావంతో వారి పట్ల భక్తీ ప్రపత్తులు కలిగి ఉండేవారు, తద్వారా దైవసన్నిధిలో మేము చేరగలమని అనుకునేవారు. కాని తరువాత ముందుకు సాగుతూ స్వయంగా ఆ అస్తిత్వాలనే ఆరాధ్యులుగా చేసుకున్నారు. వారినే సహాయానికై మొరపెట్టుకోసాగారు, వారినే ప్రార్థించసాగారు, వారిని గురించే తలపోశారు, వీరు దైవత్వంలో జోక్యం చేసుకోగల సమర్థులని, మా మొరలాలకించడం, ఆపదల్లో ఆదుకోవడం వీరివల్లనే కాగలదని భావించసాగారు. ఈ మార్గ విహీనత నుండి వెలికితీయడానికి పరమ ప్రభువు తన వచనాలను తన ప్రవక్తల ద్వారా అందజేసి విభిన్న రీతుల్లో వారికి బోధపరిచేందుకు ప్రయత్నించాడు. అయినా వారు తమ ఈ బూటకపు దేవుళ్ళ దాస్యాన్నే పట్టుపట్టి పాటిస్తూ మేము అల్లాహ్ స్థానంలో వీరినే ఆశ్రయించి ఉంటామని మొండిగా వ్యవహరించారు. ఇక చెప్పండి ఈ బహుదైవారాధకులయిన జాతులపైకి, వారి మార్గవిహీనత కారణంగా అల్లాహ్ శిక్ష అవతరిస్తే వీరి మొరలాలకించే ఆ ఆపద్బాంధవులు ఎక్కడ చచ్చారో? వారికి ఈ దుర్గతి పట్టిన కాలంలో వచ్చి వారిని ఎందుకు ఆదుకోలేదో?

33. ఈ ఆయత్ వివరణలో హజ్రత్ అబ్దుల్లా బిన్ మస్‌ఊద్, హజ్రత్ జుబైర్, హజ్రత్ అబ్దుల్లా బిన్ అబ్బాస్(రజిఅల్లాహు అన్‌హుమ్), హజ్రత్ హసన్ బస్రీ(రహ్మ), సయీద్ బిన్ జుబైర్ (రహ్మ), జర్ర్ బిన్ హుబైష్(రహ్మ), ముజాహిద్, ఇక్రిమా(రహ్మ) తదితర మహనీయుల ద్వారా ఉటంకించబడిన విషయాలన్నీ ఒక మాటను ఏకగ్రీవంగా చెబుతున్నాయి. ఈ ఆయత్‌లో ప్రస్తావించిన జిన్నులు తొలిసారిగా హాజరయిన ఈ సంఘటన 'నఖ్‌లా' మధ్యన జరిగింది. ఇబ్ను ఇస్‌హాక్, అబూ నుయైమ్ అస్‌ఫహానీ, వాకిదీ ప్రకారం ఇది జరిగిన సందర్భం, ప్రవక్త మహనీయులు (స) తాయిఫ్ నుండి నిరాశ చెంది మక్కా వైపునకు తిరుగు ప్రయాణం చేస్తున్నప్పటిది. దారిలో ఆయన 'నఖ్‌లా' ప్రాంతంలో మజిలీ వేశారు. అక్కడ ఇషా, ఫజ్ర్ లేదా తహజ్జుద్ నమాజ్‌లో ఆయన ఖుర్‌ఆన్ పారాయణం చేస్తున్నప్పుడు జిన్నుల బృందం ఒకటి అటుగా వెళ్ళడం తటస్థించింది. అది ఆయన పారాయణం వినడానికి ఆగి పోయింది. దీనితో పాటు ఉల్లేఖనాలన్నీ ఏకగ్రీవంగా చెప్పిన దాని ప్రకారం జిన్నులు ప్రవక్త(స) సమక్షంలోకి రాలేదు, ఆయన వారి రాకను పసిగట్టనూలేదు, తరువాతనే అల్లాహ్ ఆయనకు వహీ ద్వారా వారి రాకను గురించి, ఖుర్‌ఆన్ వినడాన్ని గురించి తెలిపాడు.

ఈ సంఘటన జరిగిన చోటు 'అజ్ జరైమా' అయినా కావచ్చు లేదా 'అస్సైలుల్ కబీర్' అయినా కావచ్చు. ఈ రెండు స్థానాలూ నఖ్‌లా లోయలోనే ఉన్నాయి. రెండు చోట్లా నీళ్ళు, పచ్చిక, చెట్లు ఉన్నాయి. తాయిఫ్ నుండి వచ్చేవారు ఈ లోయలో మకాం చేయవలసివస్తే ఈ రెండు చోట్లల్లోనే ఓ చోట మజిలీ వేస్తారు.

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడు అల్లాహ్ పేరుతో

# సహీహ్ బుఖారీ (6వ సంపుటం)

ఉర్దూ అనువాదం: అల్లామా వహీదుజ్జమాఁ (ర.అలై)

తెలుగు అనువాదం : ముహమ్మద్ అజీజుర్రహ్మాన్

كِتَابُ التَّفْسِيرِ

## ఖుర్ఆన్ వ్యాఖ్యాన ప్రకరణం

(కితాబుత్తఫ్సీర్)

## 2. అల్ బఖరా సూరా వ్యాఖ్యానం

### అధ్యాయం : 1

### "అల్లాహ్ ఆదమ్‌కు అన్ని వస్తువుల పేర్లూ నేర్పాడు" అన్న దైవోపదేశం గురించి...

**327)** ప్రవక్త మహనీయులు (సఅసమ్) ఈ విధంగా ప్రవచించినట్లుగా హజ్రత్ అనస్(రజి) ఉల్లేఖించారు: "విశ్వాసులు (మోమినీన్) ప్రళయదినాన వ్యాకులతతో ఒకచోట సమావేశమై (పరస్పరం) ఇలా చెప్పుకుంటారు– 'ఈ రోజు మనం మన ప్రభువు సమక్షంలో ఎవరినయినా మన కొరకు సిఫారసు చేసేవానిని పంపితే బావుంటుందేమో!' అలా చెప్పుకుని వారంతా హజ్రత్ ఆదమ్(అలైహిస్సలామ్) దగ్గరకు వెళ్ళి, 'మీరు మానవులందరికీ తండ్రి. అల్లాహ్ మిమ్మల్ని తన స్వహస్తాలతో నిర్మించాడు. మీకు సాష్టాంగ ప్రణామం చేయమని దైవదూతలకు ఆజ్ఞాపించాడు. మీకు వస్తువులన్నింటి పేర్లు నేర్పాడు. కాబట్టి మీరు మా కోసం మీ ప్రభువు సమక్షంలో సిఫారసు చేయండి. తద్వారానే మేము ఈనాటి ఈ విపత్తు నుండి బయటపడగలం' అని విన్నవించుకుంటారు.

ఆదమ్(అ) ఇలా అంటారు: "నేను దానికి తగినవాణ్ణి కాను". ఆయన తన వల్ల జరిగిన తప్పిదాన్ని జ్ఞప్తికి తెచ్చుకుని, తన ప్రభువు దగ్గరకు వెళ్ళడానికి సిగ్గుపడతారు– "మీరు నూహు (అ) దగ్గరకు వెళ్ళండి. (నా తరువాత) అల్లాహ్ ఈ భూలోక వాసుల కొరకు ప్రభవింపజేయబడిన తొలి ప్రవక్త ఆయనే" అని సలహా ఇస్తారు. అప్పుడు అందరూ కలిసి నూహ్(అ) సన్నిధిలో హాజరవుతారు. ఆయన గారు కూడా తాను ఈ పనికి తగినవాణ్ణి కాను అని చెబుతారు. తాను ఒక విషయం గురించి అల్లాహ్‌ను ప్రశ్నించిన దానిని తలచుకుని సిగ్గుతో కుంచించుకుపోతారు. "మీరు అల్లాహ్ ప్రియ నేస్తం (అలైహిస్సలామ్) వద్దకు వెళ్ళండి" అని సూచిస్తారు.

అప్పుడు వారు మహనీయ ఇబ్రాహీమ్(అ) దగ్గరకు వెళ్ళి తమ గోడు వినిపించుకుంటారు. ఆయన కూడా ఈ పనికి తాను యోగ్యుణ్ణి కానని చెప్పేస్తారు. "మీరంతా మూసా (అలైహిస్సలామ్) దగ్గరకు వెళ్ళండి. అల్లాహ్ ఆయనతో ప్రత్యక్షంగా సంభాషించాడు. ఆయనకు తౌరాత్ గ్రంథాన్ని వొసగాడు" అని సలహా ఇస్తారు. అప్పుడు వారంతా మూసా (అ) దగ్గరకు వస్తారు. కాని ఆయన కూడా తన ఇబ్బందిని గురించి చెప్పుకుంటారు, నాలో అంత ధైర్యం లేదని అంటారు. ఒకప్పుడు అకారణంగా ఒక వ్యక్తిని హత్య చేసిన సంగతి ఆయనకు జ్ఞప్తికి వస్తుంది. దాంతో ఆయన తన ప్రభువు సమక్షంలోకి వెళ్ళ దానికి జంకుతారు. "మీరంతా ఈసా(అలైహిస్సలామ్) దగ్గరకు వెళ్ళండి. ఆయన దైవ దాసుడు,

దైవసందేశహరుడు, ఆయన వాక్కు, ఆయన ఆత్మ" అని సూచిస్తారు. కాని ఈసా(అ) కూడా, తనలో అంతటి ధైర్యం లేదని చెబుతూ, "మీరంతా ముహమ్మద్(స) దగ్గరకు వెళ్ళండి. ఆయన(స) అల్లాహ్ వద్ద స్వీకృతి పొందిన దాసుడు. అల్లాహ్ ఆయన(స) వల్ల జరిగిన ముందటి వెనుకటి పొరపాట్లను క్షమించాడు" అని సలహా ఇస్తారు.

అప్పుడు విశ్వాసులందరూ నా దగ్గరకు వస్తారు. నేను వారందరితో కలసి ప్రభువు సన్నిధికి వెళ్ళి అనుమతి కోర్తాను. నాకు అనుమతి లభిస్తుంది. నేను నా ప్రభువును చూడగానే సాష్టాంగపడిపోతాను. అల్లాహ్ కోరినంత సమయం నేను సజ్దాలోనే ఉంటాను. "నీ తల ఎత్తు. ఏం కావాలో అడుగు. నీకు ప్రసాదించబడుతుంది. ఏం విన్నవించుకోదలిచావో విన్నవించుకో. నీ విన్నపాన్ని వినటం జరుగు తుంది. సిఫారసు చెయ్యి. నీ సిఫారసు ఆమోదించబడుతుంది" అని అనబడుతుంది. అప్పుడు నేను నా తల ఎత్తి, అల్లాహ్ నాకు నేర్పిన విధంగా ఆయన్ని స్తుతిస్తాను. ఆ తరువాత సిఫారసు చేస్తాను. కాని సిఫారసుకు ఒక పరిమితి నిర్ధారించబడుతుంది. దాని ప్రకారం (కొందరికి) నేను స్వర్గంలో ప్రవేశం కల్పించి తిరిగి వస్తాను. నా ప్రభువును మొదటిసారి మాదిరిగానే చూసి, సిఫారసు చేస్తాను. ఈసారి కూడా నా కొరకు ఒక హద్దు విధించబడుతుంది. వారిని నేను స్వర్గంలోకి పంపి తిరిగి వస్తాను. మూడవసారి కూడా అలాగే జరుగుతుంది. నాల్గవసారి ప్రభువు సన్నిధిలోకి వచ్చి,'ఎవరు నరకంలో శాశ్వతంగా ఉంటారని ఖుర్ఆన్ పేర్కొందో, వారు తప్ప మిగిలిన వారెవరూ నరకంలో లేరు' అని విన్న వించుకుంటాను. నరకంలో సదా శాశ్వతంగా బందీలై ఉండేవారంటే వీరే. వారి కొరకు **'ఖాలిదీన ఫీహా'** అని అనటం జరిగింది.[1]

## అధ్యాయం : 2

**'వ ఇజా ఖలవ్ ఇలా షయాతీనిహిమ్'** (2: 14) అనే ఆయత్‌పై ముజాహిద్ వ్యాఖ్యానిస్తూ, ఇక్కడ షయాతీన్ అంటే అర్థం కపటులు, బహుదైవారాధకులైన వారి స్నేహితులు, నాయకమన్యులు అన్నారు. **"ముహీతున్ బిల్ కాఫిరీన్"** అంటే అర్థం అల్లాహ్ సత్యతిరస్కారులను సమీకరిస్తాడు. **"అలల్ ఖాషియీన్"** అనే వాక్యం పక్కా విశ్వాసుల నేపథ్యంలో ఉంది. **'లాషియతఫీహా'** (2: 71) అంటే అందులో పూర్తిగా తెలుపు ఉండ కూడదు.. **'యసూమూనకుమ్'** అంటే నిన్ను నిత్యం బాధించేవారని అర్థం. **'ఫద్దారతుమ్'** అంటే మీరు పరస్పరం గొడవ పడ్డారని అర్థం (ఇవన్నీ అల్ బఖరా సూరాలో వచ్చిన పదాలు). అలాగే **'రాయినా'** అనే పదం కూడా ఈ సూరాలో వస్తుంది.[1] అరబ్బులు ఎవరినయినా తెలివిలేని మూర్ఖుడు క్రింద జమ కట్టగోరినప్పుడు ఈ పదం వాడేవారు.


327-1. విశ్వాసులు ఆదమ్(అలైహిస్సలామ్)తో 'అల్లాహ్ మీకు అన్ని వస్తువుల పేర్లు నేర్పాడు కదా!' అని అంటారు. ఇదే ఈ అధ్యాయంలోని ప్రధానాంశం. దీని ఆధారంగానే ఇమామ్ బుఖారీ (రహ్మ) ఈ హదీసును ఇక్కడ పొందు పరిచారు.

2-1. ఇమామ్ బుఖారీ(రహ్మ) అల్ బఖరా సూరాలోని కొన్ని పదాల వ్యాఖ్యానాన్ని ఇక్కడ పొందుపరిచి, దాని ఆధారంగా వాటి భావార్థాన్ని విశదీకరించారు.

ఇక ఇబ్నె అబ్బాస్(రజి) ఉల్లేఖనం ప్రకారం 'రాయినా' అనేది యూదుల భాషలో ఒక తిట్టు. హజ్రత్ సాద్ బిన్ ముఆజ్ అన్సారీ(రజి) అనే ప్రముఖ సహాబీ, యూదులు పదేపదే దైవప్రవక్త(స) గురించి 'రాయినా' అని అంటుండటం చూసి, 'ఇక మీదట దైవప్రవక్త(స) గురించి అలా అన్నవారి తల నరికేస్తానని హెచ్చరించారు.

# ఖుర్‌ఆన్‌పై అతిపెద్ద అపవాదు

**20వ శతాబ్దిలో** ఇస్లాంపై, ఖుర్‌ఆన్‌పై విమర్శకులు లేవనెత్తిన అభ్యంతరాలను, మోపిన అపవాదులను సహేతుకంగా తిప్పికొట్టిన ఇస్లామీయ తత్వవేత్తలలో ఎన్నదగిన వారు మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూదీ (రహ్మ). ఈ నేపథ్యంలో ఆయన విరచితమైన 'తఫ్‌హీమాత్', 'తన్‌ఖీహాత్' చాలా కీలకమైనవి.




దివ్య ఖుర్‌ఆన్‌లోని అల్ బఖరా అధ్యాయం 62వ ఆయత్‌ను ఆధారంగా తీసుకుని దానికి కొందరు ప్రబుద్ధులు తొడిగిన వక్రభాష్యం చాలా భయంకరమైనది. ఆ భాష్యం ఎంత ప్రమాదకరమైనదంటే, రుజుమార్గం వైపునకు నిర్దేశన చేసే ఖుర్‌ఆన్ పునాదులనే అది పెకలించి వేయగలదు. అది ఒకవైపున ముస్లిమేతరులకు, ఖుర్‌ఆన్ సత్యసందేశ పిలుపును త్రోసిపుచ్చేందుకు స్వయంగా ఖుర్‌ఆన్ నుండే వాదనాధారాన్ని సమకూర్చడంతోపాటు, మరోవైపున ముస్లిం సముదాయంలోని వంచనా శిల్ప నిష్ణాతుల చెర నుండి బయటపడటానికి తహతహలాడుతున్న వారికి ఇది ఇస్లామ్- కుఫ్ర్ మధ్య గల 'విచక్షణ'ను ఎత్తి వేయడానికి ఖుద్దుగా ఇస్లామ్ ద్వారానే 'అనుమతి' ఇప్పిస్తుంది. అంతేకాదు, దైవప్రవక్త ముహమ్మద్(స)ను అనుసరించే చాలామంది విశ్వాసుల 'విశ్వాసాన్ని' కూడా కుదిపివేస్తుంది. వారిని సందిగ్ధంలో పడవేస్తుంది. ఒక విధంగా ఇదొక మాస్టర్ స్ట్రోక్ (**Master Stroke**) వంటిది.

అల్ బఖరా సూరాలోని 62వ ఆయత్ ఆధారంగా సందేహాల స్వాములు, అనుమానాల అయ్యలు లేవనెత్తిన ఆక్షేపణలను మౌలానా మౌదూదీ(రహ్మ) 'తర్జుమానుల్ ఖుర్‌ఆన్' మాస పత్రిక ద్వారా గట్టిగా తిప్పి కొట్టారు. ఈ సందర్భంగా ఆయన ఖుర్‌ఆన్‌లోని పలు వచనాలను ఉటంకించి ప్రజా బాహుళ్యాన్ని అపమార్గం నుండి కాపాడారు.

ఈ నేపథ్యంలో తెలుగులో వచ్చిన ఓ చిరు పుస్తకమే **'ఖుర్‌ఆన్‌పై అతిపెద్ద అపవాదు'**. తెలంగాణ ఇస్లామిక్ మిషన్ వారు వెలువరించిన ఈ చిరు పుస్తకం పాఠకులకు, ముఖ్యంగా 'దాయీలకు' ఎంతో ఉపయుక్తమైనది.

**పేజీలు : 32 వెల : రూ.30/-**

**ప్రతుల కొరకు క్రింది చిరునామాకు సంప్రదించండి:**

**TALANGANA ISLAMIC MISSION**

**Islamic Centre, Lakkadkote,**

**Chatta Bazar, Hyderabad- 500 005.**

**Mob: 9618316060, 7330048257, 7660012481**

వ్యక్తి సంస్కార, సంఘ నిర్మాణ
నైతిక పథకం

సహజీవన భావనల పాపురాయి
గీటురాయి
వారపత్రిక



# స్వాతంత్ర్యం కన్నా స్వామిభక్తికి ప్రాధాన్యమిచ్చిన ఎర్రకోట ప్రసంగం

యం.డి. ఉస్మాన్‌ఖాన్

**ఆగస్టు 15న ఎర్రకోట బురుజుల నుండి ప్రధాని నరేంద్ర మోడీ జాతినుద్దేశించి చేసిన ప్రసంగం ముగిసి కొన్ని రోజులు గడిచాయి.**

దేశ స్వాతంత్ర్య దినోత్సవం అనేది ప్రతి భారతీయుడికి గర్వకారణమైన రోజు. ఐతే ఇది కేవలం జాతీయ పతాకాన్ని ఎగురవేయడం లేదా ఆచారంగా జరిగే కార్యక్రమాల వరకే పరిమితం కాదు. ఇది జాతి చరిత్రను మలుపు తిప్పిన త్యాగాలను స్మరించుకోడానికి, ప్రస్తుత దేశ పరిస్థితిని సమీక్షించుకోవటానికి, రాబోయే భవిష్యత్తు దిశను నిర్దేశించుకోడానికి ఒక మహత్తర సందర్భం. ఇలాంటి సందర్భంలో ప్రధానమంత్రి చేసే ప్రసంగం ఒక సాధారణ ఉపన్యాసం కాదు, అది జాతి భవిష్యత్తుకు దిశా నిర్దేశన కావాలి. ప్రజల ఆశలు, ఆకాంక్షలు, నమ్మకాలను ప్రతిబింబించే సూచిక కావాలి. కానీ ఈసారి ప్రధాని మోడీ చేసిన ప్రసంగం, ఆ ఉద్దేశానికి చాలా దూరంగా ఉంది.

ఏకబిగిన పదకొండేళ్ళు అధికారంలో ఉన్న నాయకుడి నుండి ప్రజలు ఏమి ఆశిస్తారు? కేవలం నినాదాల పరంపరనా? లేక తాను పాలించిన కాలంలో దేశం సాధించిన విజయాలు, ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కార మార్గాలు, భవిష్యత్తు కార్యాచరణ వంటి విషయాల పారదర్శకమైన విశ్లేషణనా? మోడీ ప్రసంగం ఈ రెండింటినీ ఇవ్వలేకపోయింది. ఆయన మాటల్లో గణాంకాల ప్రస్తావన ఉన్నా అవి వాస్తవాలకు తగినట్లుగా లేవు, భవిష్యత్తుపై చూపిన దృశ్యం అస్పష్టమైందే తప్ప స్పష్టమైన రోడ్‌మ్యాప్ కాదు. ఒక నాయకుడు తన ప్రసంగంతో ప్రజల్లో విశ్వాసం నింపాలి, కానీ ఇక్కడ మాత్రం మరింతగా నిరాశలోకి నెట్టే వచనాలే వినిపించాయి.

దేశం ఈ రోజు ఎదుర్కొంటున్న ప్రధాన సవాళ్లను విస్మరించి ప్రసంగం కొనసాగింది. నిరుద్యోగం అనేది ప్రతి కుటుంబాన్ని కుంగదీస్తున్న వాస్తవం. డిగ్రీలు పూర్తి చేసుకున్నా ఉద్యోగం దొరకని యువత రోడ్లపై తిరుగుతోంది. వారిలో నైపుణ్యాలు ఉన్నా, అవకాశాలు లేకపోవడం వలన కలిగిన విసుగుతో నిరాశ వ్యాపిస్తోంది. కానీ ప్రధాని ప్రసంగంలో ఇది ఒక ప్రధాన అంశంగా మారలేకపోయింది. యువత కోసం ప్రత్యేకించి చెప్పుకోదగ్గ చర్యల ప్రస్తావన లేకపోవడం, భావి తరాలకు ఇచ్చే హామీల శూన్యతను బట్టబయలు చేస్తోంది. ఒకవైపు 'స్టార్టప్ ఇండియా' అనే మాటల మోత మిన్నంటుతున్నా, మరోవైపు లక్షలాది యువకులు వలస వెళ్లి విదేశాల్లో కూలి పనులు చేస్తున్నారు. ఈ విరుద్ధ దృశ్యాన్ని ఎదుర్కొంటున్న దేశంలో ప్రధానమంత్రి అసలు సమాధానం ఇవ్వకుండా మాటల మంత్రదండంతో విషయాన్ని దాటవేయడం ఎంతవరకు సమంజసం?

అదే విధంగా రైతుల పరిస్థితి కూడా ప్రసంగంలో నిర్లక్ష్యం పాలైంది. దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక అయిన రైతులు అప్పుల బారిన పడి ఆత్మహత్యలకు పాల్పడుతున్న దారుణం ఇంతవరకు తగ్గలేదు. గతంలో 'రైతు ఆదాయం రెట్టింపు చేస్తాం' అని నినదించిన మోడీ, అది ఏ స్థాయిలో అమలులోకి వచ్చిందో ఒక సున్నితమైన సమీక్ష చేయవలసింది. కానీ అది జరగలేదు. రైతులు ఈ రోజు మరిన్ని కష్టాల్లో మగ్గుతున్నారు. పంటలకు తగిన ధర లభించక, మార్కెట్‌లో మధ్య దళారుల ఆధిపత్యం కొనసాగుతూనే ఉంది. ఎరువులు, విత్తనాల ధరలు పెరిగి రైతుల జీవితాలను నరకంగా మార్చేశాయి. ఈ అంశాలు ప్రస్తావనకు కూడా రాకపోవడం, దేశ నాయకత్వం రైతుల పట్ల ఎంత విస్మృత వైఖరితో ఉందో అర్థమవుతోంది.

ద్రవ్యోల్బణం మరో మహా సమస్య. సాధారణ మధ్యతరగతి ప్రజలు కూరగాయలు కొనలేని స్థితి. నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రజలు ప్రధానమంత్రి నుండి ఏం ఆశిస్తారు? కనీసం ఒక ఆత్మపరిశీలన, ఒక హామీ, ఒక దిశానిర్దేశన. కానీ ప్రసంగం మాత్రం దాని జోలికి పోకుండా, శుష్క వాగ్దానాల చుట్టూ తిరుగాడింది.

అదే సమయంలో దేశంలో పెరుగుతున్న అసమానతలు కూడా మోడీ ప్రసంగంలో మాయమైపోయాయి. ఒకవైపు కార్పొరేట్ వర్గం అపార ధనాన్ని కూడబెట్టుకుంటుంటే, మరోవైపు కోట్లాది మంది ప్రజలు కనీస జీవన ప్రమాణాలను కూడా పొందలేక పోతున్నారు. మేక్ ఇన్ ఇండియా, డిజిటల్ ఇండియా వంటి కార్యక్రమాలు పేపర్‌పై మెరిసినా, వాస్తవ జీవితంలో సాధారణ ప్రజలకు ఉపశమనం ఇవ్వలేకపోయాయి. ఈ వైరుధ్యాలను ప్రస్తావించ కుండా, ప్రధాని తనకు నచ్చిన అంశాలను రంగుల తెరపై ఆవిష్కరించారు.

అంతేకాదు, దేశ భద్రత, అంతర్గత శాంతికి సంబంధించిన విషయాల్లోనూ సత్యం చెప్పకుండా దాచిపెట్టారు. సరిహద్దుల్లో పెరుగుతున్న ఉద్రిక్తతలు, అంతర్గతంగా సామాజిక విభజన, మతపరమైన విరోధాల వంటి వాటిని ప్రస్తావించే ధైర్యం చేయలేదు. బదులుగా, శుష్క జాతీయతా నినాదాలతోనే ప్రసంగాన్ని నింపేశారు. ప్రజలకు కావలసింది వాస్తవ పరిస్థితులను అంగీకరించే నిజాయితీ గల నాయకత్వమే కాని కేవలం ప్రచార ఆర్భాటాలతో, కల్లబొల్లి కబుర్లు చెబుతూ కాలం వెళ్ళదీసే కోతలరాయుళ్ళు కాదు.

ఇక్కడ మనం గమనించదగ్గ మరో విషయం, మోడీ ప్రసంగంలో ఆరెస్సెస్‌ను (రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్) బహిరంగంగా పొగడటం. స్వాతంత్ర్య దినోత్సవం అనేది జాతి త్యాగాలను స్మరించుకునే రోజు, ఇది సమస్త భారతీయుల పండుగ. అలాంటి వేదిక నుంచి ఒక అతివాద భావజాల సంస్థను ప్రశంసించడం, దాన్ని జాతీయ పునాదిగా చూపించడం ప్రజాస్వామ్యానికి అవమానం. స్వాతంత్ర్య పోరాటంలో ఆరెస్సెస్ పాత్ర ఏమిటి? స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలకు ఆరెస్సెస్ అనుసంధానం ఎక్కడుంది? కానీ ప్రధానమంత్రి ఆ వేదికను వినియోగించి ఆరెస్సెస్ భజన చేయడం, దేశాన్ని ఒక ప్రత్యేక భావజాలం వైపు మళ్ళించాలనే దురుద్దేశాన్ని బహిర్గతం చేసింది. ఇది జాతి ఏకతకు తీవ్రమైన ముప్పు.

ప్రజాస్వామ్యంలో విమర్శలను వినగలిగే మనస్తత్వం అవసరం. కానీ మోడీ ప్రభుత్వంలో వ్యతిరేక స్వరాలు దేశద్రోహం ముద్రతో నింపబడ్డాయి. ఆ పరిస్థితిని చూసి ప్రజలు భయపడుతున్నారు. ఇలాంటి సందర్భంలో స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగం ఒక స్వేచ్ఛా వేదికగా ఉండాలి, అందరి ఆత్మగౌరవాన్ని మేళవించే సందర్భం కావాలి. కానీ అది జరగలేదు.

మోడీ ప్రసంగంలో మరో ముఖ్యమైన లోపం, భవిష్యత్తుపై స్పష్టత లేకపోవడం. ఒక దేశం ఎదగాలంటే దిశాబోధన అవసరం. రాబోయే దశాబ్దాల్లో దేశం ఏం చేయాలి, ఎలా ముందుకు సాగాలి, ఏ సవాళ్లు ఎదుర్కోవాలి అనే అంశాలు ప్రజలకు చెప్పే బాధ్యత దేశాధినేతపై ఉంటుంది. కానీ మోడీ మాటల్లో భవిష్యత్తుపై దార్శనికత కన్నా, గత విజయాలను వర్ణించుకోవడమే ఎక్కువైంది. అవి కూడా వాస్తవాలకు దూరంగా, అర్ధసత్యాల ముసుగులో మగ్గిపోయాయి.

ప్రజలు బాగా అలసిపోయారు. దాదాపు పదకొండేళ్లుగా ఒకే తరహా వాగ్దానాలు, ఒకే రకమైన నినాదాలు వింటూ వస్తున్నారు. మొదట్లో ఆకర్షించిన మాటలు ఇప్పుడు శూన్యంగా అనిపి స్తున్నాయి. 'అచ్ఛే దిన్' అన్న నినాదం వాస్తవంలో ఎక్కడ ఉ ంది? స్వాతంత్ర్యం అనంతరం కోట్లాది పేదలకు ఇచ్చిన భరోసా ఎటు పోయింది? ఈ ప్రశ్నలకు సమాధానం లేకుండా, కేవలం కొత్త కొత్త పేర్లతో పాత పద్ధతులనే పునరావృతం చేయడం ప్రజల మనసుల్లో విసుగును పెంచుతోంది. ప్రధాని ప్రసంగం ప్రజల సమస్యలను ప్రతిబింబించకపోగా కేవలం రాజకీయ నినాదాలకే పరిమితమైపోయింది.

స్వాతంత్ర్య దినోత్సవం లాంటి పవిత్రమైన రోజు కూడా, ఒక రాజకీయ వేదికగా మారిపోయింది. ఇది ప్రజాస్వామ్యానికి నష్టం. దేశ చరిత్రను మనం గౌరవించాలి, త్యాగాల్ని స్మరించుకోవాలి, భావి తరాలలో ఆశలు నింపాలి. కానీ ఈ ప్రసంగం ఆ గౌరవాన్ని దక్కించుకోలేకపోయింది.

ప్రజలు ఇప్పుడు ఎదురు చూస్తున్నది కొత్త నినాదాల కోసం, కొత్త మాయ మాటల కోసం కాదు. వారికి కావలసింది మార్పు. నిజమైన మార్పు. ఇది కేవలం ప్రభుత్వ మార్పు కాక, పాలనా పద్ధతిలో మార్పు కావాలి. మాటలలో కాక, చేతల్లో కనబడే మార్పు కావాలి. ప్రజల సమస్యలను వాస్తవంగా అంగీకరించి, వాటి పరిష్కారం కోసం కృషి చేసే మార్పు కావాలి.

ఇప్పటి వరకు జరిగింది కేవలం ప్రచారం మాత్రమే. కానీ దేశాన్ని సుస్థిరంగా నిలబెట్టేది ప్రచారం కాదు, ప్రజలపై నమ్మకం. అది నిజాయితీ గల చర్యల ద్వారా మాత్రమే వస్తుంది. ప్రసంగాలు ఒక క్షణం ఆకట్టుకోవచ్చు, కానీ చిత్తశుద్ధితో కూడిన కార్యా చరణలు చరిత్రలో నిలబడతాయి. మోడీ ప్రసంగం మాత్రం ఈ విషయాన్ని మరచి, ప్రజల మనసుల్లో మొలకెత్తిన నిరాశను తొలగించగలిగే వచనం కాకుండా, అసంతృప్తిని మరింతగా పెంచింది. ఇప్పుడు దేశం ఎదురు చూస్తున్నది శుష్క నినాదాల కోసం కాదు, నిజమైన మార్పుకోసం. ప్రతి భారతీయుడి గుండె చప్పుడు ఇదే, జాతి భవిష్యత్తుకై నిజాయితీగా నిలబడే నాయకత్వం నేటి అవసరం. దానికై దేశం ఎదురు చూస్తోంది. ❖



# అన్నదానం అల్లాహ్‌కు ఎంతో ఇష్టం

**- సయ్యిద్ అబ్దుస్సలామ్ ఉమ్రీ**

**వారు స్వయంగా నిరుపేదలై ఉండి కూడా ఇతరుల అవసరాలకే ప్రాధాన్యం ఇస్తారు. నిజంగా పేరాశ, పిసినారితనాల నుండి రక్షించబడినవారే ధన్యులు, సఫలీకృతులూను. (అల్ హష్ర్: 9)**

అన్నదానం, అనేది రెండు పదాలతో రూపొందించబడింది, 'అన్నం' అంటే ఆహారం, 'దానం' అంటే ఇవ్వడం లేదా దానం చేయడం. అన్నదానాన్ని 'మహాదానం' అంటారు. ప్రతీ జీవికి ప్రశాంతమైన జీవితాన్ని గడపడానికి కొన్ని ప్రాథమిక అంశాలు అవసరం. గూడు, గుడ్డ వంటి అంశాలు జీవన నాణ్యతను ప్రభావితం చేస్తున్నప్పటికీ, కూడు లేకపోతే జీవితమే లేదు. ఆహారం లేకపోతే ఏ ప్రాణీ జీవించలేదు.

అన్నదానము చెయ్యాలన్న ఆలోచన కలగటం అల్లాహ్ అనుగ్రహం మన మీద ఉందనడానికి ప్రబల నిదర్శనం. ఎందుకంటే, అన్నదానం ఒక వరం, అది పేదల ఆకలిని తీరుస్తుంది. అన్నదానం అల్లాహ్‌కు ఎంతో ఇష్టం, అది సమాజానికి మేలు చేస్తుంది. అన్నం పెడితే, ఆకలి తీరుతుంది, ఆరోగ్యం మెరుగవుతుంది, ఆయుష్షు పెరుగుతుంది. అన్నదానం చేస్తే, పుణ్యం వస్తుంది, అల్లాహ్ అనుగ్రహిస్తాడు, సంతృప్తి కలుగుతుంది. కాబట్టి అన్నదానం చేయండి, ఆనందంగా బ్రతకండి. ఒక్క మాటలో చెప్పాలంటే, నిత్య జీవితంలో మనం ఎదుర్కొనే అనేక ఇబ్బందుల నుండి, ఇక్కట్ల నుండి బయటపడడానికి చక్కటి పరిష్కారంగా పనిచేస్తుంది అన్నదానం. అన్నదానం వలన ఎన్ని సమస్యలున్నా పరిష్కారమవుతాయని చెప్తారు పెద్దలు.

ఆహారం- అది భౌతికమా, ఆధ్యాత్మికమా అన్న విషయాన్ని కాసేపు ప్రక్కన పెడితే, అది సమస్త శరీర శక్తి స్వరూపం. ఏది లోపించినా బ్రతకగలం. కానీ ఆహారం లోపిస్తే బ్రతకలేం. ధర్మం ఆచరించాలంటే శరీరం శక్తిమంతమై ఉండాలి. శారీరక శక్తికి ఆహారం అవసరం. ఆహారంలోని ప్రధాన భాగమే అన్నం. అందుకే అన్నదానం అన్ని దానాల్లోకి శ్రేష్టమైందని చెప్తారు. ఎందుకంటే ఏది దానంగా ఇచ్చినా... ఎంత ఇచ్చినా ఇంకా ఇంకా కావాలనిపిస్తుంది. కాని అన్నదానంలో మాత్రం దానం తీసుకున్నవారు ఇంక చాలు అని చెప్పి సంతృప్తిగా లేస్తారు. ఏ దానం ఇచ్చినా

దానం తీసుకున్న వారిని మనం సంతృప్తి పరచలేకపోవచ్చు కాని అన్నదానం చేస్తే మాత్రం దానం పుచ్చుకున్నవారిని పూర్తిగా సంతృప్తి పరచవచ్చు. అన్నదానం చేయలేకయినా అన్నం పెట్టే ఇంటినన్నా చూపించమని అల్లాహ్ ఆదేశిస్తున్నాడు. అన్నదానం విశ్వాసంలో అవిభాజ్య అంశం అంటున్నాడు.

**పరలోక తీర్పును ధిక్కరించేవాడ్ని నీవు గమనించావా? అతనే అనాథలను కసరి కొట్టేవాడు. పేదల అన్నదానం కోసం (ఇతరుల్ని) ప్రోత్సహించనివాడు. (అల్-మాఊన్: 1-3)**

అంతేకాదు, అలా చేయని వ్యక్తులకు నరక యాతన తప్పదని హెచ్చరిస్తున్నాడు-

**వారు- స్వర్గవాసులు (నరకంలో) పాపాత్ముల్ని చూసి "మిమ్మల్ని ఏ విషయం నరకంలో పడవేసింది?" అని అడుగుతారు. దానికి పాపాత్ములు ఇలా అంటారు: "మేము నమాజు చేసే వారిలో చేరలేదు. పేదలకు అన్నదానం చేసేవారం కాము. సత్యతిరస్కారులతో కలసి మేమూ (సత్యాన్ని) తిరస్కరిస్తుండేవాళ్ళం. తీర్పుదినాన్ని అసత్య విషయమని ఖండిస్తుండేవాళ్ళం. ఈ స్థితిలోనే చివరికి అనివార్య విషయం (మృత్యువు) మా ముందు కొచ్చింది." అప్పుడు సిఫారసు చేసేవారి సిఫారసు వారికి ఏమాత్రం ఉపయోగపడదు. (అల్-ముద్దస్సిర్: 42-48)**

ఆకలితో ఉన్నవాడికి పట్టెడన్నం పెడితే వచ్చే పుణ్యం ఎంతో, ఎంతెంతో! అల్లాహ్ మీద ఉండే ప్రేమపారవశ్యంతో నిరుపేదలకు, అనాథలకు, ఖైదీలకు అన్నదానం చేస్తారు. (వారు అన్నార్తులతో అంటారు:) "మేము అల్లాహ్ కోసం అన్నదానం చేస్తున్నాం. అంతేగాని మీనుండి ప్రతిఫలంగాని, కృతజ్ఞతలుగాని ఆశించడం లేదు. మేమసలు ఘోరమైన ఆపద తెచ్చిపెట్టే సుదీర్ఘ దినం గురించి దేవునికి భయపడుతున్నాం.

(అద్-దహ్ర్: 08-10)

## అన్నదాతలకు లభించే మహా గొప్ప సన్మానం

అన్నదాతలకు లభించే బహుమానం ఈ ఆయతులలోనే 18 రకాలు.

1) అల్లాహ్ వారిని ఆ రోజు కీడు నుండి కాపాడి 2) ఉల్లాసం, ఉత్సాహాలను అనుగ్రహిస్తాడు. (కష్టాల్లో) సహనం వహించినందుకు ప్రతిఫలంగా 3) వారికి స్వర్గవనాలు, 4) పట్టు వస్త్రాలు ప్రసాదిస్తాడు. 5)వారక్కడ అద్భుతమైన ఆసనాలపై మెత్తటి దిండ్లకానుకొని కూర్చొని ఉంటారు. 6) వారికి ఎండ బాధగాని, 7) చలి బెడదగాని ఉండదు. 8) స్వర్గవృక్షాలు వారికి నీడనిస్తాయి. 9) వాటి పండ్లు 10) వారికి అనుక్షణం అందుబాటులో ఉంటాయి.

(అద్-దహ్ర్: 11-14)

11) వారి ముందు వెండిపాత్రలు, గాజుగ్లాసులు తెచ్చిపెడ్తారు. గాజుగ్లాసులు కూడా వెండిలా మెరిసిపోతుంటాయి. అవన్నీ సరైన లెక్క ప్రకారం నింపబడి ఉంటాయి. 12) వారికి అక్కడ సొంటి కలిపిన మధుపాత్రలు అందించబడతాయి. 13) ఇది కూడా స్వర్గంలో పారే ఒక సెలయేరు. దీన్ని సల్‌సబీల్ అంటారు.

(అద్-దహ్ర్: 15-18)

14) వారిసేవ కోసం నిత్యబాలలు అటూ ఇటూ పరుగిడుతుంటారు. నీవా పిల్లల్ని చూస్తే చెదరిన ఆణిముత్యాల్లా కన్పిస్తారు. 15) నీకక్కడ ఎటు చూసినా రంగ రంగ భోగ భాగ్యాలు, మహోన్నత సామ్రాజ్య వైభవాలు కన్పిస్తాయి. 16) వారి దేహాలపై పల్చటి పట్టు పీతాంబరాలు, 17) బంగారు జల్తారు వస్త్రాలు ఉంటాయి. 18) వారు వెండి కంకణాలు ధరించి ఉంటారు. వారి ప్రభువు వారికి ఎంతో పరిశుద్ధమైన మద్యం ప్రసాదిస్తాడు. "ఇదీ మీ ప్రతిఫలం. మీ కృషికి తగిన విలువ, ఆదరణలు లభించాయి." (అద్-దహ్ర్: 19-22)

మనలో చాలా మందికి "అన్నము" అంటే తెలియదు . బియ్యాన్ని ఉడికించి చేసిన పదార్థాన్నే అన్నము అంటారని అనుకుంటూ ఉంటారు. కానీ నిజానికి ప్రతి మనిషికి పంచ కోశములు అని అయిదు కోశములు ఉంటాయి. అవి అన్నమయ , ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ, ఆనందమయ కోశములు. అన్నమయ కోశము స్థూల శరీరానికి సంబంధించినది. ఈ అన్నమయ కోశములో ప్రవేశించే అన్నము ప్రాణశక్తిగా మారుతున్నది. కనుక అన్నమయ కోశములోనికి వెళ్ళే ఆహారమే అన్నము అని అర్థం. మనము ఏది తిన్నా అది అన్నమే అవుతుంది. కేవలం బియ్యం ఉడికించినది మాత్రమే కాదు. అన్నమే అన్నకోశములో ప్రవేశించి ప్రాణంగా మారుతున్నందువలన అన్నదానం అంటే ప్రాణాన్ని దానం చేయడమే. అంతే కాదు, ఒక ప్రాణం నిలవడానికి కావలసినది అన్నమే. కనుక అన్నదానం చేయడం శ్రేష్టం అని ఖుర్‌ఆన్, హదీసు గ్రంథాలు చెప్తున్నాయి. ఏదైనా దానం చేసేప్పుడు విచక్షణ అవసరం కానీ అన్నదానానికి మాత్రం ఈ నియమం లేదు. అన్నదానం చేయడం అంటే వాళ్ళ ప్రాణాన్ని నిలపడమే కనుక అత్యంత శ్రేష్టం అయినది అన్నదానం.

**"ప్రజలారా! మీరందరూ కరుణామయుణ్ణి ఆరాధించండి, తరచూ అన్నదానాలు చేస్తూ ఉండండి. సలామ్ (శాంతి)ని సర్వసామాన్యం చేయండి అన్నారు మహనీయ ముహమ్మద్ (స)". (ఇమామ్ అల్బానీ సహీహ్‌గా పేర్కొన్నారు)**

ఆకలి గొన్నవారికి అన్నం పెట్టడం, దాహం అయినవారికి నీళ్ళివ్వడం ప్రతి మనిషి చేయాల్సిన కనీస ధర్మం. అన్ని దానాలకన్నా అన్నదానం గొప్పది. నిరుపేదలకు, ఆకలిగొన్నవారికి అన్నం తినిపించటం చాలా గొప్ప పని. ఇందులో అవసరాల్లో ఉన్నవారి అవసరాలు తీర్చటం అనే అర్థం కూడా ఉంది. అదేవిధంగా పరిచయమున్నా లేకపోయినా ప్రతి ఒక్కరికీ సలాం చేయటం కూడా చాలా గొప్ప లక్షణం. ఈ రెండు పనులూ ఎలాంటివంటే వీటి వల్ల పరస్పరం ప్రేమాభిమానాలు పెంపొందుతాయి. హృదయాల్లో ఉండే అక్కసు, అసూయ, ద్వేషభావాలు నశిస్తాయి.

అందరూ జీవించాలంటే ఆహారం అవసరం. ఎదగడానికి, అడగడానికి, ఆరాధించడానికి, ఒకరిని ఆదుకోవడానికి. ఆదరువుగా నిలవడానికి, చదువుకోవడానికి, ఆటలాడటానికి కావాల్సిన శక్తి కూడా ఆహారం నుంచే అందుతుంది. ఆరోగ్యానికీ తగిన పోషకాహారం ఉండాలి. వరదలు, ఇతర విపత్తులు, ఆర్థిక ఇబ్బందులు వచ్చినప్పటికీ ఎవరూ ఆకలితో అలమటించకుండా చూడటము మనిషిగా మనందరి కర్తవ్యం. ఆహార భద్రత అంటే కేవలం ఆకలి తీర్చడమే కాదు, ప్రజలందరూ ఆరోగ్యంగా, గౌరవంగా జీవించడానికి అనువైన పరిస్థితులను కల్పించడం, తద్వారా దేశ ప్రగతికి పునాదులు వేయడం.

మనకు బాగా అనుభవం ఉన్న ఓ విషయం -"మనం వంటింట్లోకి వేరే పని మీద వెళ్ళినా వంట చేస్తున్న అమ్మగారు "పెట్టేస్తా నాన్నా ఒక్క అయిదు నిముషాలు" అంటారు బుజ్జగిస్తూ, నేను అన్నం కోసం వచ్చాననుకుని! ఎంతయినా అమ్మ అంటే అన్నం. అన్నం అంటే అమ్మ! అంతే!

ఏటా వంద బస్తాల బియ్యం మాకు ఇంటికి వచ్చినా మా తండ్రి గారు "అన్నీ మనవికావు నాయనా" అని బీదసాదలకి చేటలతో పంచేసేవారు. అన్నీ మనవికావు అనటంలో వున్న అర్థం, పరమార్థం నేను పెద్దయి ఖురాన్‌లో ఈ ఆయతు చదివితేగాని అర్థం కాలేదు అంటాడు ఓ మహానుభావుడు.

(మీ కోసం) పందిళ్ళ మీద ప్రాకే, ప్రాకని చెట్లతో సహా రకరకాల తోటలు, తోపులను సృష్టించినవాడు ఆ దేవుడే. వివిధరకాల ఆహార పదార్థాలు ఉత్పత్తి చేసే పొలాలు, ఖర్జూరపు చెట్లను కూడా ఆయనే సృష్టించాడు. ఆయనే ఆలివ్, దానిమ్మ వృక్షాలను సృజిస్తున్నాడు. వాటి పండ్లు చూడటానికి ఆకారంలో దాదాపు ఒకేలా ఉన్నా రుచిలో తేడా ఉంటుంది. అవి పంటకు వచ్చినపుడు వాటి పండ్లు హాయిగా తినండి. దాంతోపాటు పంట కోతకు వచ్చినప్పుడు అందులో నుంచి దేవుని హక్కు (పేదల ఆర్థిక హక్కు) కూడా నెరవేర్చండి. దుబారా చేయకండి. దుబారా చేసేవారిని దేవుడు ప్రేమించడు. (అల్-అన్‌ఆమ్: 141)

## నోటి కాడి కూడు లాగేసుకుంటున్నారు

దొడ్డు బియ్యం పంపిణీతో అక్రమాలు జరుగుతున్నాయని వాటిని అరికట్టేందుకు పేదవారికి ఉచితంగా సన్నబియ్యం పంపిణీ చేస్తుంది ప్రభుత్వం. దీంతో అక్రమ బియ్యం రవాణాకు అడ్డుకట్ట పడుతుందని అనుకున్నప్పటికీ కొన్నిచోట్ల మాత్రం దందా ఆగటం లేదు. ఈ దందాలకు కొన్నిచోట్ల డీలర్లే సూత్రధారులుగా కనిపిస్తున్నారు. మరికొన్ని చోట్ల డీలర్లు తమ తెలివి ఉపయోగించి అధికారులకు తెలియకుండా బియ్యాన్ని బుక్కుతున్నారు. రాళ్లు తిని అరిగించుకోగల వయసులో వున్నప్పుడు తినటానికి మరమరాలు కూడా దొరకలేదు! వజ్రాలూ, వైడూర్యాలూ పోగేసుకున్న ఈ వయసులో మరమరాలు కూడా అరగట్లేదు! అదే విధి! ఈ లోకం చాలా వింతైనది, బహు విచిత్రమైనదీనూ. ఇక్కడ అందరూ భిక్షగాళ్లే, అడుక్కునేవాళ్లే. లేనివాడి పోరాటం "కూటి" కోసం.. ఉన్నవాడి ఆరాటం "కోట్ల"కోసం.

## ఆకలి కేకలను ఆపగలమా..!

ప్రపంచంలో పోషకాహార లోపం వున్న వారు అత్యధికంగా ఆసియా దేశాల్లో 41.8 కోట్ల మంది ఉండగా, ఆఫ్రికాలో 28.2 కోట్ల మంది ఉన్నారు. కరోనా మహమ్మారి విజృంభణతో అదనంగా 3 కోట్ల మంది పేదలు ఆకలితో అలమటించారు. ప్రత్యేక చర్యలు అమలు పరచని పక్షంలో 2030 నాటికి 66 కోట్ల మంది పేదలు ఉంటారని, ఆకలిని అంతం చేయడం కష్టమే గానీ ఇస్లాం చూపిన జీవన సరళిని అనుసరిస్తే సాధ్యమే. అందులో సందేహం అక్కర్లేదు.

అల్లాహ్ ప్రసాదితమైన అన్నాన్ని నిందించడం, లోపాన్ని ఎంచడం, వృథా చేయడం తగదని పలు సందర్భాల్లో ప్రవక్త (స) హెచ్చరించారు. ఆకలిగొన్నవాడికి అన్నం రుచి, సమయం తెలియవట. అటువంటి వాడికి అన్నదానం చేయడంకన్నా పుణ్యకార్యం మరేదీ లేదని విజ్ఞులు భోధిస్తున్నారు. పై కారణాల వల్లనే పూర్వం రాజులు, నేటి మహాత్ములు ఎందరో అన్నసత్రాలు కట్టించేవారు కట్టించారు. అన్న సంతర్పణ చేయించేవారు చేయిస్తున్నారు కూడా.

హజ్రత్ అబూ హురైరా (రజి) కథనం: దైవప్రవక్త (సల్లం) ఎన్నడూ ఏ అన్నంలోనూ లోపం ఎత్తిచూపలేదు. ఆయనకు అది ఇష్టమయితే తినేవారు, ఇష్టం లేకపోతే మానుకునేవారు.

(బుఖారీ- ముస్లిం)

ఈ హదీసులో కూడా దైవప్రవక్త (స) గారి ఉత్తమ నడవడిక బోధించబడింది. అందులో మనందరికి మంచి ఆదర్శం ఉంది. మన విధానం దైవప్రవక్త (స) విధానానికి పూర్తిగా విరుద్ధమైనది. భోజన రుచుల్లో ఒక్కపూట ఏ చిన్న తేడా వచ్చినా మనం పెద్ద గలాటా చేస్తాం. దిక్కులు పిక్కటిల్లేలా కేకలు పెడతాం. దైవప్రవక్త ఆదర్శ విధానానికి అనుగుణంగా నేడు మన జీవితాల్లో మార్పు రావలసిన అవసరం ఎంతైనా ఉంది.

**అన్నదాన విశిష్టతను తెలియజేసే కొన్ని హదీసులను తెలుసు కుందాం:**

**అల్లాహ్‌కు మిక్కిలి ఇష్టమైన సత్కార్యం అన్నదానం**

అల్లాహ్‌కి అత్యంత ప్రియమైన పనుల్లో ఒకటి ఒక ముస్లిముకు సంతోషాన్ని ఇవ్వడం, లేదా అతని కష్టాన్ని తొలగించడం, లేదా ఆకలిని పోగొట్టడం, లేదా అప్పును తీర్చడం. నిస్సందేహంగా, అన్నదానం చేయడం ఈ గొప్ప కార్యాలలో ఒకటి." (సహీహ్ తర్గీబ్)

హదీస్ (జాబిర్ రజియల్లాహు అన్హు) ఉల్లేఖనం: దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు: "హజ్‌కు సంబంధించిన ఉత్తమ సదాచారా లలో ప్రధానమైనవి - ఆకలితో ఉన్నవారికి ఆహారం అందించడం, మధురమైన, సత్సంబంధాలను పెంచే మాటలు మాట్లాడటం."
(ముస్తద్రక్ హాకిమ్)

"హజ్ నిజమైన పుణ్యం అనేది కేవలం విధుల నిర్వహణలో మాత్రమే కాకుండా- అది మానవతా సేవలతో కూడి ఉండాలి. ఇతరుల పట్ల దయ, సేవా దృక్పథం, సహృదయతతో కూడిన ప్రవర్తన కూడా హజ్ పరిపూర్ణతకు ముఖ్యం. ఆకలితో ఉన్నవారికి ఆహారం అందించడం, ఇతరుల హృదయాలను గెలుచుకునే విధంగా మధురంగా, మర్యాదగా మాట్లాడటం - ఇవే హజ్‌లోని సద్గుణాలకు ప్రతీకలు."

**(మిగతా వచ్చేవారం)**

# సమయం వృధా - కారణాలు




స్థూలంగా సమయం వృధా అవటానికి గల కారణాలు రెండు. అవి 1) అవసరం లేని పనులకు సమయం వెచ్చించటం. 2) అనవసరమైన పనులకు ఎక్కువ సమయం ఖర్చు చేయడం.

మొదటి దాని వల్ల మనకు నష్టం కలుగుతుంది. రెండవది మనల్ని అసమర్థులుగా తయారు చేస్తుంది. చాలామంది పనులు సరిగా చేయాలని ప్రయత్నిస్తారు. కాని సరైన పనులు చేయాలని తాపత్రయపడరు. పనులు సరిగా చేయడం వల్ల సమర్థత పెరుగుతుంది. సరైన పనులు చెయ్యడం వల్ల జీవితం సఫలం అవుతుంది. జీవితంలో విజయం సిద్ధిస్తుంది. ఏదో ఒకటి ఎంచుకోమని చెప్పడం లేదు కానీ, మనకు ఏది అవసరమో ఆ పనుల్ని సరిగ్గా చేయాలి.

➢ సక్రమమైన పనులను గుర్తించి మన ప్రాధాన్యతలు రాసుకోవాలి. లక్ష్యాలు నిర్దేశించుకోవాలి. అందుకు అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి. అవసరం లేని పనులు ఎంత చక్కగా చేసినా ప్రయోజనం లేదు. మీ పనులను పరిశీలించి, మీరే ఏమి ఫలితాలు సాధించాలనుకుంటున్నారో నిర్ణయించుకోండి. అందుకు ఏమి చేయాలి? చక్కగా విశ్లేషించుకొని, సమయాన్ని సమర్థవంతంగా ఉపయోగించుకోండి. రెండు, మూడు పనులు కలిపి చేయవచ్చా? మార్పులు, చేర్పులు అవసరమా? ఇదే ఫలితాన్ని తక్కువ శ్రమతో, తక్కువ సమయంలో ఎలా సాధించవచ్చు? సమయాన్ని, స్థలాన్ని మార్చడం ప్రయోజనకరమా? కాదా? నిర్ణయించుకోండి.

➢ మనం చేయాలనుకునే పనులకు అవసరమైన వ్యక్తులందర్నీ కూడగట్టండి. చర్చలు, సమావేశాలు నిర్వహించండి. అదే పని చేసే ఇతరులతో పోల్చుకోండి. వారి నుండి నేర్చుకునేదేమైనా (మంచి) ఉంటే నేర్చుకోండి. టైమ్ షెడ్యూల్‌ను తయారు చేసుకోండి. వాటికి కట్టుబడి పని చేయండి. ఉత్పాదకతకు అడ్డుపడే ఆటంకాలను గుర్తించి, వాటిని తొలగించండి. మిమ్మల్నీ, మీరు పని చేసే వ్యవస్థనూ మెరుగుపరచుకోవటానికి ప్రయత్నించండి. అసమర్థతనూ, అనుత్పాదక పద్ధతులను విడిచిపెట్టండి. సమర్థత, ఉత్పాదకత పెరిగితే సమయం వృధా కాకుండానే అద్భుత ఫలితాలు సాధించవచ్చు. ప్రయత్నించడం తప్పు కాదు!

కథ

షేక్ అబ్దుల్ సమద్, నంద్యాల



# అమ్మకానికి అమ్మా నాన్న!

**అప్పుడే** ఆఫీసు నుండి వచ్చిన జాహెద్ రిలాక్స్‌గా సోఫాలో కూర్చుంటూ వంట గదిలో ఉన్న భార్యకు "ఏమండి! శ్రీమతి గారు వంటగదిలో ఏం చేస్తున్నారు? అలసిపోయిన భర్తను కాస్త పట్టించుకోండి" అంటూ చిలిపిగా కేకేసాడు. జనరల్‌గా ఆఫీసు నుండి వస్తూనే బాత్ రూమ్‌లో రిఫ్రెష్ అయి డ్రెస్సు మార్చుకొని వచ్చి కూర్చుంటాడు జాహెద్. కాని రేపు శుక్రవారం స్వాతంత్ర్య దినోత్సవం, మర్నాడు కృష్ణాష్టమి, తరువాత ఆదివారం. కాబట్టి రిలాక్స్‌గా సోఫాలో కూర్చుండి పోయాడు. సాజిదా, జాహెద్ వివాహం అయి మూడు సంవత్సరాలు అయినా ఇప్పటికీ నూతన దంపతులుగానే ఉంటారు. రెండు నెలల క్రితమే సాజిదా తల్లి కాబోతున్న విషయం తెలిసి దంపతుల ఆనందానికి అవధులు లేవు.

జాహెద్‌కు గత సంవత్సరమే ఉద్యోగం వచ్చింది. అంతకు ముందు ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేసేవాడు. చిన్నప్పుడే తల్లిదండ్రులను కోల్పోయిన జాహెద్ వరుసకు మామయ్య దగ్గర ఉన్నా చాలాకాలం బయట హాస్టల్లో ఉండి తన డిగ్రీ పూర్తి చేసాడు. పేద కుటుంబం కాబట్టి వాళ్ళ ఆదరణ అంతంత మాత్రమే ఉండేది. తను చదవటం అత్తయ్యకు సుతరామూ ఇష్టం ఉండేది కాదు. జాహెద్ తమకు భారమని భావించేవారు.

పుట్టగానే తల్లిని కోల్పోయిన సాజిదాను మామయ్య చేరదీసినా, పెద్ద అయ్యే కొద్దీ అత్తయ్య వేధింపులు ఎక్కువయ్యాయి. ఇంటర్ పూర్తిచేసిన తదుపరి చదువులకు అత్తయ్య ససేమిరా అనడంతో మామయ్య ధైర్యం చేయలేక పోయాడు.

జాహెద్ పని చేసే కంపెనీలోనే సాజిదా మామయ్య పనిచేస్తూ ఉండటం అపుడప్పుడు సాజిదాకు తన భార్య వేధింపుల నుండి కాపాడాలంటే పెళ్ళి చేయాలని ఉన్నానని, తల్లి లేని పిల్ల తన భార్య కర్కశత్వం వల్ల చాలా సార్లు ఆకలి కడుపుతో ఉండి పోతుందని మాటల సంధర్భంగా ఆవేదన వ్యక్తం చేసేవాడు. జాహెద్ ఒంటరి జీవితం చూస్తున్న పెద్దలు సాజిదాను పెండ్లి చేసుకోమని కోరడం, అప్పటికే సాజిదాపై జాలిగా ఉన్న జాహెద్ ఈ వివాహానికి అంగీకరించడం సహజంగా జరిగిపోయాయి. అప్పటికే ధార్మిక భావాలు ఉన్న జాహెద్ ఒక్క పైసా కట్నం లేకుండా మస్జిద్‌లో ఆదర్శ వివాహం చేసుకున్నాడు. వివాహమైన రెండు నెలలకే హైదరాబాద్‌లో మరో కంపెనీలో చేరిన జాహెద్ భార్యతో హైదరాబాద్ షిఫ్ట్ అయ్యాడు. సాజిదా అత్తయ్య అసలు పెండ్లికే రాలేదు. ఏమైనా అదృష్టం కొద్దీ జాహెద్‌కు ఓ సాఫ్ట్‌వేర్ కంపెనిలో ఉద్యోగం రావడంతో ఓ మంచి ఇల్లు అద్దెకు తీసుకొని అక్కడ నిరాడంబర జీవితానికి నాంది పలికారు ఆ దంపతులు. తల్లిదండ్రుల ఆప్యాయతలకు దూరమైన సాజిదా, జాహెద్ దంపతులు ఆ ప్రేమలు ఒకరిలో ఒకరు చూసుకొనేవారు.

భార్య తెచ్చిన ఘుమఘుమలాడే చాయ్ దట్టిస్తూ టేబుల్‌పై ఉన్న పత్రిక అందుకున్నాడు. "అమ్మకానికి అమ్మా నాన్నా" అన్న శీర్షికతో ఉన్న మ్యాటర్ విచిత్రంగా అనిపించింది. నిజమైన వార్తే. ఇద్దరు ముసలి తల్లిదండ్రుల ప్రకటన అది. రెండు సార్లు చదివి జాహెద్ చాలా ప్రభావితుడయ్యాడు. వృద్ధ దంపతులు తాము అమ్మకానికి ఉన్నట్లు తమను కొనుగోలు చేయువారు రెండున్నర లక్షలు చెల్లించాల్సి ఉంటుందని, కావలసినవారు ఫలానా అడ్రసుకు రాగలరని, ఫోన్ నెంబర్‌తో సహా పత్రికలో ప్రకటన ఇచ్చారు. అప్పుడే టీ కప్పుతో వచ్చిన భార్య ముందు ఆ వార్త ఉంచాడు జాహెద్. సాజిదా భర్తకు మరింత దగ్గరగా జరిగి వృద్ధ దంపతుల ప్రకటన చదివింది. టీ తాగి ఇద్దరూ చాలా

సేపు మౌనంగా ఉండి తమ భావాలు పంచుకుంటున్నారు. ఈ అమ్మా నాన్నను మనం తెచ్చుకుందాం అండీ! అంది సాజిదా. కరెక్టే సాజి! మనం ఇప్పటికే మధ్య తరగతి జీవితంలో ఉన్నాం. పైగా ఈ చిన్న అద్దె ఇంట్లో ఉంటున్నాం. వాళ్ళ ఆరోగ్య సమస్యలు, మందులు మనం న్యాయం చేయగలమా అంటూ సందేహం వ్యక్తం చేసాడు జాహెద్. లేదండి! మనం ఇద్దరం తలిదండ్రుల ప్రేమను చూడలేకపోయాం. కనీసం మన పిల్లలకు అవ్వా తాతల వాత్సల్యం, ఆప్యాయతలు చూపుదాం అంటూ భర్తను లాలింపుగా అడిగింది సాజీ. అవును సాజిదా, నేను కూడా మనం కోల్పోయిన తల్లితండ్రుల ప్రేమానుబంధాలు మన సంతానానికి చూపాలి అనుకుంటున్నా, కాని రెండున్నర లక్షలు ఎలా సమకూర్చగలం? నా దగ్గర బహు కష్టంగా లక్ష రూపాయలు ఉన్నాయి అంటూ డబ్బు ఎలా అన్న మీమాంసలో ఉండి పోయాడు. సాజిదా భర్త చేతిని తన చేతిలో తీసుకొని "నాకు మీరు తీసుకున్న నగలు ఉన్నాయి. అవి అమ్మేద్దాం. నాకు నగల కన్నా మన సంతానానికి జేజి తాతయ్యలు ముఖ్యం అండి. మనకు దూరమైన తల్లి తండ్రుల ప్రేమ వీరిలో చూసుకుందాం. మనం రేపే ఆ అడ్రసుకు వెళుదాం. నగలు ఎక్కడైనా తాకట్టు పెట్టండి" అంటూ డిసైడ్ చేసేసింది.

మరుసటి రోజు స్కూటీపై అడ్రస్ మ్యాపింగ్ చేసుకుంటూ జాహెద్, సాజిదా ఆ యింటికి చేరుకున్నారు. ప్రకటనలో తాము చూసిన ఇంటిని కన్ఫాం చేసుకొని జాహెద్ కాలింగ్ బెల్ నొక్కాడు. రెండో బెల్లుకు ధృడంగా ఉన్న ఓ పెద్దాయన తలుపు తెరిచి ఏమి కావాలి? అని అడిగారు. ఫలానా ప్రకటన చూసి వచ్చాము ఆ ఇల్లు ఇదేనా అంటూ ఆరా తీశాడు జాహెద్. పెద్దాయన లోలోపల ఉబ్బి తబ్బిబ్బై పోతున్నాడు. హెూ! ఇదే.. ఇదే ఆ చిరునామా. రండి! లోపలికి రండి అంటు జాహెద్ యువ దంపతులను లోపలికి పిలుచుకొని పోయారు పెద్దాయన. బేగం! బయటికి రా. మన కోసం ఎవరో వచ్చారు అంటూ పిలిచారు. లోపలి నుండి ఊతకర్రతో హుందాగా నడిచొచ్చింది ఓ పెద్దావిడ. ప్రకటనలో ఉన్న వ్యక్తుల పరిస్థితికి విరుద్ధంగా ఉంది. ఆశ్చర్యంగా అడుగుతున్నాడు జాహెద్, మీరు ఆరోగ్యంగానే ఉన్నారు. మీరేనా లేదా.. మాటలు పూర్తి కాకుండానే పెద్దాయన అందుకున్నారు "అసలు వృద్ధ దంపతులను డబ్బులు చెల్లించి మీరు ఎందుకు కొనాలని వచ్చారు?"

"నా భార్య నేను తల్లితండ్రుల ప్రేమకు తపించాం, మీతో ఆ ప్రేమాభిమానాలు పొందాలని వచ్చాం" అన్నారు జాహెద్.

పెద్దావిడ అందుకుంది, "దైవం మిమ్మల్ని మా వద్దకు పంపించాడు నాయనా. మాకు సంతానం లేదు, ఈ ఇల్లు ఇంకా చాలా ఆస్తులు ఉన్నాయి. మేము పిల్లల ప్రేమ కోసం తపిస్తున్నాం. పిల్లలు లేని ఈ ధనం ఆస్తులు ఎవరి కోసం? అందుకే శేష జీవితం మా కోసం వచ్చేవారితో మాకు సంతానంగా గడిపే వారికి ఇచ్చి వేయాలనుకున్నాం. మంచి మనసున్న వారిని అన్వేషించుటకు ఈ ప్రకటన చేసాం. ధనం ఉందంటే చాలా మంది వస్తారు. కాని మా ధనం కోసం వచ్చేవారి వద్ద మేము స్వచ్ఛమైన ప్రేమ పొందలేము. అందుకే కొన్ని అబద్దాలు పేర్కొనాల్సి వచ్చింది. పరస్పరం కోల్పోయిన ప్రేమానుబంధాలు పొందుదాం. రండి మీరు మమ్మల్ని తీసుకుపోయినా మేము వస్తాము లేదా మీరే ఇక్కడకు వచ్చెయ్యండి" అంటూ ఆ యువ దంపతులను హృదయానికి హత్తుకున్నారు అమ్మానాన్నా ఆనందభాష్పాలతో...


యువతరానికి
విప్లవనాదం
చేతనవాదం

సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

ఒక వారం చదవండి
ప్రతి వారం చదువుతారు !

చందా వివరాలు

| | |
|---|---|
| విడిప్రతి | ₹ 15 |
| ఆరు మాసాల చందా | ₹ 375 |
| సాలుసరి చందా | ₹ 750 |

ఆన్‌లైన్ ద్వారా పైకం చెల్లించి గీటురాయి వారపత్రికను తెప్పించుకోవచ్చు.

బ్యాంక్ అకౌంట్ వివరాలు
GEETURAI WEEKLY
Central Bank of India,
Noor Khan Bazar Branch, Hyderabad
A/c. No. 1042789768
IFSC Code. CBIN0282407

లేదా

పైకాన్ని యం.ఓ. లేక డి.డి. ద్వారా కూడా పంపవచ్చు. డి.డి ద్వారా పంపదలిస్తే డి.డి.ని 'Geeturai Weekly' పేర మాత్రమే తీయాలి.

GEETURAI WEEKLY
SANDESHA BHAVANAM, LAKKADKOT,
CHATTA BAZAR, HYDERABAD - 500 002.
Phone: 24564583, 24576237
E-mail: geeturaiweekly@gmail.com



# సమాజ సేవలో దైవప్రవక్త(స)

- నసీరా బేగం

**దైవసందేశ హరులు మానవ మాత్రులే. వారి సంబోధితులు కూడా మానవులే.** ప్రవక్తలు మానవుల మధ్యలోనే జీవితం గడుపుతూ ఉంటారు. సామాజిక జీవితం, సంఘటిత జీవితం గడుపుతూ ఉంటారు. ఇంకా సమాజ సంస్కరణ కార్యాలలో పాల్గొంటూ ఉంటారు. ప్రజల సుఖ దుఃఖాలలో పాల్గొని వారి కష్టాలను తొలగించే ప్రయత్నం చేస్తూ ఉంటారు. అంతేకాదు, ప్రజలకు హితబోధ చేస్తూ ఉంటారు. వారికి జ్ఞానాన్ని నేర్పుతూ ఉంటారు. వారికి ధార్మిక శిక్షణను ఇస్తూ ఉంటారు. వారి సంస్కరణకు శతవిధాల కృషి చేస్తూ ఉంటారు. ఒకవైపు ప్రవక్తల సంబంధం అల్లాహ్‌తో పటిష్టంగా ఉంటుంది. మరొకవైపు ప్రజలతో సత్సంబంధాలు దృఢంగా ఉంటాయి. ఇదే దైవ సందేశహరుని ప్రధాన కర్తవ్యం. ప్రజల మధ్యలో ఉంటూ సాధారణ జీవితం గడుపుతూ దైవసందేశాన్ని దైవదాసులకు చేరవేయటమే వారి ముఖ్యమైన ఉద్దేశం.

ఈ విధానం ద్వారానే ప్రజల సంస్కరణ సాధ్యం అయ్యే వీలు ఉంటుంది. కనుక కారుణ్య ప్రభువైన అల్లాహ్ తన ప్రవక్తల ద్వారా ఈ సామాన్య పద్ధతిని, ప్రజల సంస్కరణా విధానాన్ని ఏర్పాటు చేశాడు. కాని కొంతమంది అజ్ఞానులు దేవుని ఈ పద్ధతిని కూడా హేళన చేశారు. చివరి దైవప్రవక్త ముహమ్మద్(స) దైవ సందేశాన్ని ప్రజలకు చేరవేసే ప్రయత్నం చేస్తూ ఉన్నప్పుడు తిరస్కారులైన ప్రజలు ఈ విషయాన్నే ప్రశ్నించారు. అప్పుడు అల్లాహ్ తన గ్రంథంలో ఇలా సెలవిచ్చాడు: ప్రజల ముందుకు మార్గదర్శకత్వం వచ్చినప్పుడల్లా, దానిని విశ్వసించకుండా వారిని ఆపిన విషయం ''ఏమిటి, అల్లాహ్ మానవుణ్ణి ప్రవక్తగా చేసి పంపాడా?'' అనే వారి పలుకు తప్ప మరేమీ కాదు. వారికి ఇలా చెప్పు : ''భువిలో దైవదూతలు నిశ్చింతగా తిరుగుతూ ఉండి వుంటే మేము తప్పకుండా ఆకాశం నుండి దైవదూతనే వారి కోసం ప్రవక్తగా పంపి ఉండేవారము''. (17: 94,95)

అంటే ప్రజల కష్టాలు, వారి మనస్తత్వాలు, వారి అవసరాలు, వారి దుఃఖాలు, వారి బాధలు అన్నీ మానవుల ప్రతినిధియే చక్కగా అర్థం చేసుకోగలుగుతాడు. వారికి సహాయం చేయగలుగుతాడు. కనుక మానవుల మధ్య మానవునినే ప్రవక్తగా చేసి పంపటం సమంజసం అనే విషయం ఆలోచిస్తే చక్కగా అర్థమవుతుంది.

చివరి దైవప్రవక్త అయిన ముహమ్మద్(స) ప్రత్యేక గుణం ఏమిటంటే, ఆయన(స) ప్రజల ఈతి బాధలను లోతుగా అర్థం చేసుకునేవారు. అంతేకాదు, వాటిని దూరం చెయ్యటానికి అవిరళ కృషి చేసేవారు. వారి కష్టాలను, దుఃఖాలను తన కష్టాలుగా, తన దుఃఖాలుగా భావించేవారు. కనుకనే ఆయన్ని(స) అల్లాహ్ తన గ్రంథంలో కారుణ్య ప్రవక్త అనే బిరుదును ఇచ్చాడు. ఆయన(స) గురించి దివ్య ఖుర్‌ఆన్‌లో ఇలా సెలవీయటం జరిగింది.

> **చూడండి! మీ వద్దకు ఒక ప్రవక్త వచ్చాడు. ఆయన స్వయంగా మీలోనివాడే. మీరు నష్టానికి గురికావటం అనేది ఆయనకు కష్టం కలిగిస్తుంది. మీ సాఫల్యాన్ని ఆయన తీవ్రంగా కాంక్షిస్తాడు. విశ్వాసులపై ఆయన వాత్సల్యం కలవాడు, కారుణ్యం కలవాడు. (9: 128)**

దైవప్రవక్త ముహమ్మద్(స) ప్రవక్త పదవిని అలంకరించక పూర్వం నుంచే ఆయన(స) ప్రజలను ప్రేమించేవారు. వారి సేవ చేసేవారు. అగత్యపరులను ఆదుకునేవారు. వితంతువులకు, అనాథలకు సహాయం చేసేవారు. అల్లాహ్ ఆయన(స)ను ప్రవక్తగా ఎన్నుకుని హిరా కొండ గుహలో మొట్టమొదటి వహీ అవతరింపజేసినప్పుడు ఆయన వణికిపోతూ ఇంటికి వచ్చి తనపై దుప్పటిని కప్పమని భార్య హజ్రత్ ఖదీజా(ర)కు చెప్పినప్పుడు ఆమె గారు ఆయన్ని ఓదార్చుతూ ధైర్యాన్నిస్తూ ఇలా అన్నారు :

దైవసాక్షిగా! అల్లాహ్ మీకు ఎన్నటికీ అగౌరవం పాలు చెయ్యడు. మీరు అతిథులను గౌరవిస్తారు. వారి పట్ల మంచిగా ప్రవర్తిస్తారు. ఇతరుల బరువును మోస్తారు. నిస్సహాయులకు, అగత్యపరులకు సహాయపడతారు. ఆపదకు గురైన ప్రజలను ఆదుకుంటారు.

దైవప్రవక్త ముహమ్మద్(స) ప్రవక్తగా ఎన్నుకోబడిన తరువాత ప్రజల సేవ, వారి సంస్కరణ రెండు బాధ్యతలు ఆయన(స)పై విధిగా అయిపోయాయి. ఒకవేళ ప్రవక్త కేవలం ధార్మిక విషయాలనే బోధిస్తూ ఉంటూ వారి దైనందిన జీవిత సమస్యలను పట్టించుకోకపోతే సమాజ సంస్కరణ అనేది జరగదు. వారికి మార్గదర్శకత్వం చూపించటం అనేది ఎంతమాత్రం సాఫల్యానికి నోచుకోదు. కనుక అల్లాహ్ మానవ సమస్యలను సంస్కరించే విషయంలో దివ్య ఖుర్ఆన్‌లో ఎన్నో వాక్యాలను అవతరింపజేశాడు. బఖరా సూరాలోని 177వ వాక్యంలో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

సత్కార్యం అంటే మీరు మీ ముఖాలను తూర్పుకో, పడమరకో త్రిప్పటం కాదు. సత్కార్యం అంటే మనిషి అల్లాహ్‌నూ, అంతిమ దినాన్ని, దూతలనూ, అల్లాహ్ అవతరింపజేసిన గ్రంథాన్ని, ఆయన ప్రవక్తలనూ హృదయపూర్వకంగా విశ్వసించటం. ఇంకా అల్లాహ్ పట్ల ప్రేమతో తాము ఎక్కువగా ఇష్టపడే ధనాన్ని బంధువుల కొరకూ, అనాథుల కొరకూ, నిరుపేదల కొరకూ, బాటసారుల కొరకూ, సహాయం చెయ్యండి అని అర్థించేవారి కొరకూ, ఖైదీలను విడుదల చెయ్యటానికి వ్యయపరచటం. ఇంకా నమాజును స్థాపించటం, జకాత్ ఇవ్వటం, వాగ్దానం చేస్తే దానిని పాలించేవారూ, కష్టకాలంలో, లేమిలో, సత్యానికీ అసత్యానికీ మధ్య జరిగే పోరాటంలో స్థైర్యం చూపేవారూ సత్పురుషులు. వాస్తవంగా సత్యసంధులు, అల్లాహ్ ఎడల భయభక్తులు కలవారు వీరే. (2: 177)

ఈ వాక్యంలో స్పష్టంగా విశ్వాస విషయాలను, ఆధ్యాత్మిక విషయాలను తెలపటం జరిగింది. వాటిని ఆచరించమని ప్రోత్సహించటం జరిగింది. దానితోపాటు ప్రజల సేవా కార్యక్రమాలను చెయ్యమని తాకీదు కూడా చెయ్యటం జరిగింది. వాటిని పాటించేవారే నిజమైన భయభక్తులు కలవారు అని స్పష్టంగా చెప్పటమూ జరిగింది. అలాంటి ప్రజలే అసలైన విశ్వాసులు అని కూడా తెలియజేయబడింది. దీనిద్వారా దైవ విశ్వాసం, దైవారాధనలు, సమాజ సేవ ఇవన్నీ ఒకదానితో ఒకటి సంబంధం కలిగి ఉన్నాయని తెలుస్తోంది.

దీనికి వ్యతిరేకంగా తిరస్కార వైఖరిని అవలంబించేవారి గుణాలను కూడా ఈ గ్రంథంలో స్పష్టంగా తెలియజేయటం జరిగింది.

“ఎంతమాత్రం కాదు, కాని అసలు మీరు అనాథులను గౌరవంగా చూడరు, నిరుపేదలకు అన్నం పెట్టే విషయంలో మీరు ఒకరినొకరు ప్రోత్సహించుకోరు, వారసత్వపు ఆస్తి మొత్తాన్ని పోగు చేసి తినేస్తారు. ధన వ్యామోహంలో దారుణంగా చిక్కుకుపోయారు. (89: 17-20)

అంటే దీనిద్వారా తెలపబడిన విషయమేమిటంటే అవిశ్వాసుల హృదయాలలో ప్రజల పట్ల ప్రేమానురాగాలు ఉండవలసిన చోట ధనం పట్ల ప్రేమ, వ్యామోహం పెరిగిపోతోంది. దాని కారణంగా వారు నిస్సహాయులను, నిరుపేదలను ఆదరించటానికి ఎంతమాత్రమూ ముందుకు రారు.

ఇంకా ఇస్లామ్ ధర్మం  మనిషి గౌరవ మర్యాదల విషయంలో కూడా అత్యంత జాగరూకతగా వ్యవహరించాలని సూచించింది. ఇంకా కులమత బేధాలకు అతీతంగా సమాజ సేవ చెయ్యమని ప్రోత్సహించింది. అగత్యపరుల విషయంలో మీరు వారిని వెతికి, వారి పరిస్థితులను తెలుసుకుని మరీ సహాయం చెయ్యమని బోధించింది. చాలామంది అగత్యపరులు వారి అవసరాలు తీరకపోయినా వారు  తమ గౌరవ మర్యాదలను కాపాడుకోవటానికి చెయ్యిచాచి అడగరు. అలాంటి వారికి ప్రాధాన్యత ఇవ్వమని కూడా తెలియజేసింది. ఇంకా మీరు సహాయం చేసిన విషయాన్ని కూడా ఇతరులకు తెలియజేయకుండా గుప్తంగా ఉంచమని కూడా బోధించింది. ఒకవేళ పేరు ప్రఖ్యాతులు పొందటం కోసం ఆ సహాయాన్ని ఇతరులకు తెలియజేసినట్లయితే మీరు చేసిన సహాయానికి లభించవలసిన సత్కార్యం అంతా వృధాగా పోతుందని హెచ్చరించింది.

దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు; మీరు ప్రజలకు చేసే సహాయాన్ని ప్రకటించకండి. మీరు ఒక చేత్తో సహాయం చేస్తే మరొక చేతికి తెలియనట్లుగా చెయ్యండి అని. దైవప్రవక్త(స) అత్యధికంగా దానధర్మాలు చేసేవారు. తన వద్ద ఉన్న చివరి దిర్హమ్ వరకు ఖర్చుపెట్టేసేవారు. అవసరం రీత్యా వచ్చిన వారినెవరినీ ఖాళీ చేతులతో ఎన్నడూ పంపేవారు కాదు. తన వద్ద లేకున్నా, తన సహచరులను ప్రోత్సహించేవారు. లేదా ఇతరుల వద్ద అప్పుగా తీసుకుని అయినా వారి అవసరాలను తీర్చేవారు. దైవప్రవక్త(స) జీవితం మనకు ఆదర్శప్రాయం.




## భారత సీనియర్ పురుషుల ఫుట్‌బాల్ జట్టు ప్రధాన కోచ్‌గా ఖాలిద్ జమీల్

భారత సీనియర్ పురుషుల జాతీయ ఫుట్‌బాల్ జట్టుకు ప్రధాన కోచ్‌గా ఖాలిద్ జమీల్‌ను రెండేళ్ల ఒప్పందంపై నియమించినట్లు అఖిల భారత ఫుట్‌బాల్ సమాఖ్య (AIFF) తెలిపింది. "మన జాతీయ జట్టుకు నాయకత్వం వహించే బాధ్యత నాకు అప్పగించినందుకు నేను చాలా గర్వంగా భావిస్తున్నాను. భారతీయ ఆటగాళ్లకు శిక్షణ ఇచ్చే అవకాశం నాకు లభించింది. వారి బలాలు, బలహీనతలను నేను సున్నితంగా అర్థం చేసుకున్నాను. CAFA నేషన్స్ కప్, సింగపూర్‌తో జరగనున్న కీలకమైన ఆసియా కప్ క్వాలిఫైయర్స్‌కు మనం సిద్ధమవుతున్నప్పుడు ఈ విషయాలు మన ప్రతి కార్యాచరణకు ప్రాథమికంగా ఉంటాయి" అని జమీల్ అన్నారు.

## ప్రతి పది మంది భారతీయ మహిళల్లో ఆరుగురు ప్రమాదంలో..!

ప్రపంచవ్యాప్తంగా అనీమియా పెద్ద సమస్యగా మారింది. ప్రత్యేకంగా భారతీయ మహిళల్లో ఈ సమస్య మరింత ఎక్కువగా కనిపిస్తోంది. నేషనల్ ఫ్యామిలీ అండ్ హెల్త్ సర్వే (NFHS-5) 2019-21 నివేదిక ప్రకారం.. 15-49 ఏళ్ల వయస్సున్న భారతీయ మహిళలలో సుమారు 57 శాతం మంది రక్తహీనతతో బాధ పడుతున్నారని తెలుస్తోంది. అంటే ప్రతి 10 మహిళల్లో ఆరుగురు ఈ సమస్యతో బాధపడుతున్నారు. గర్భిణుల్లో ఈ సంఖ్య సుమారు 52 శాతంగా ఉంది. అదేవిధంగా 15-19 ఏళ్ల యువతుల్లోనూ సగటున సగానికిపైగానే ఈ సమస్యతో బాధపడుతున్నట్లుగా గణాంకాలు పేర్కొంటున్నాయి.

## ఆందోళనకరంగా ఆత్మహత్యలు

దేశంలో ఆందోళనకర స్థాయిలో ఆత్మహత్యలు చోటు చేసుకుంటున్నాయి. అత్యధికంగా ఆత్మహత్యలు నమోదవుతున్న రాష్ట్రాల్లో తెలంగాణ నాలుగో స్థానంలో ఉండటం గమనార్హం. దేశంలో 2018 నుంచి 2022 వరకు నమోదైన ఆత్మహత్యల వివరాలను నేషనల్ క్రైం రికార్డ్స్ బ్యూరో (ఎన్సీఆర్బీ) వెల్లడించింది. దీని ప్రకారం.. రాష్ట్రంలో 2018లో 7,845 మంది ఆత్మహత్యలు చేసుకోగా, 2019లో 7,675, 2020లో 8,058, 2021లో ఏకంగా 10,171 మంది బలవన్మరణాలకు పాల్పడ్డారు. 2022లో ఆ సంఖ్య 9,980గా నమోదైంది. ఐదేళ్లలో 43,729 మంది ఆత్మహత్యలు చేసుకోగా ఏటా సగటున 8,746 మంది ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎన్సీఆర్బీ తెలిపింది. వీరిలో ఆర్థిక, కుటుంబ సమస్యలతో పాటు వివిధ కారణాలతో క్షణికావేశంలో ప్రాణాలు తీసుకున్న వారిలో విద్యార్థులు, యువకులు, నిరుద్యోగులు ఎక్కువగా ఉన్నారు. ఇటీవల రాజ్యసభలో ఓ సభ్యుడు అడిగిన ప్రశ్నకు కేంద్ర ప్రభుత్వం ఈ మేరకు సమాధానమిచ్చింది. దక్షిణాది రాష్ట్రాల్లో ఆత్మహత్యలు ఎక్కువగా నమోదవుతున్నాయి. దేశంలోని తొలి ఐదు రాష్ట్రాల జాబితాలో తెలంగాణతో పాటు కేరళ, తమిళనాడు కూడా ఉండడం గమనార్హం. కాగా 2023 నుంచి 2025 వరకు జరిగిన ఆత్మహత్యల వివరాలను ఎన్సీఆర్బీ వెల్లడించలేదు.

## ఈసీపై సన్నగిల్లిన ప్రజా విశ్వాసం!

భారత ఎన్నికల కమిషన్ (ఈసీ)పై ప్రజలకు విశ్వాసం సన్నగిల్లుతున్నది. అంతేకాదు, ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) వల్ల తమ ఓటు హక్కును కోల్పోయే పరిస్థితి దాపురించిందని పేదలు, అణగారిన వర్గాల ఓటర్లు ఆందోళన చెందుతున్నారు. లోక్‌నీతి-సీఎస్‌డీఎస్ తాజా సర్వేలో ఈ అంశాలు వెలుగు చూశాయి. "పత్రాలు లేకపోవడం వల్ల పేదలు ఓటు హక్కును కోల్పోవడం, ఎన్నికల కమిషన్‌పై నమ్మకం సడలిపోవడం జరిగే అవకాశాలు" పేరుతో ఈ అధ్యయనం జరిగింది. దీని ప్రకారం, రకరకాల గుర్తింపు, నివాస ధ్రువీకరణ పత్రాలను కోరడం సంపన్న పౌరులకు 'సమంజసమైనది'గానే కనిపించవచ్చు. కానీ, అతి తక్కువ వనరులు గల వారి విషయంలో ఇది తీవ్రమైన అడ్డంకులను సృష్టిస్తుంది. పేదలు, నిరక్షరాస్యులు, గ్రామీణ లేదా సాంఘికంగా వెనుకబడిన వర్గాల ప్రజల్లో అత్యధికులకు ఈ ప్రక్రియ పెను భారంగా, శాపంగా పరిణమిస్తుంది. ఎన్నికల కమిషన్‌పై ప్రజలకు నమ్మకం తగ్గిపోతున్నదని ఈ సర్వేలో వెల్లడైంది. ప్రత్యేక సమగ్ర సవరణలో ఓటర్ల జాబితాల నుంచి అర్హులైన ఓటర్లను తప్పుడు పద్ధతుల్లో తొలగించే అవకాశం ఉందని ఈ సర్వేలో పాల్గొన్న వారిలో 45 శాతం మంది ఆందోళన వ్యక్తం చేశారు.

## గాజాలో ఆకలి మరణాలు

ఇస్రాయీల్ దాడులకు వేలాది మంది చనిపోతే.. ఆకలికి తట్టుకోలేక వందలాది మంది చనిపోతున్నారు. గాజాలో తీవ్రమైన ఆకలికి తట్టుకోలేక 112 మంది చిన్నారులతో సహా 263 మంది చనిపోయారని పాలస్తీనా ఆరోగ్య మంత్రిత్వశాఖ తెలిపింది. గాజాకు వెళ్లే ఆహారాన్ని, నీటిని, మానవతా సహాయాన్ని ఇస్రాయీల్ మే నెల నుంచే నిషేధించింది. దీంతో గాజాలోని ప్రజలు తిండిలేక అల్లాడుతున్నారు. తాగడానికి నీరులేక డీహైడ్రేషన్‌కు గురవుతున్నారు. ఈ పరిస్థితుల్లో చిన్నారులు చర్మాన్ని కప్పుకున్న ఎముకల గూడులా.. అస్థిపంజరాల్లా ఉన్నారు.

## 6 వేల మంది విదేశీ విద్యార్థుల వీసాలు రద్దు

అమెరికాలో చదువుతున్న విదేశీ విద్యార్థులపై ట్రంప్ సర్కారు కొరడా ఝుళిపిస్తోంది. చట్టాలను ఉల్లంఘించడంతో పాటు దేశంలో అనధికారికంగా ఎక్కువ కాలం నివసించడం తదితర కారణాలతో ఆ దేశ విదేశాంగ శాఖ 6 వేల మందికి పైగా అంతర్జాతీయ విద్యార్థి వీసాలను రద్దు చేసింది. వీరిలో ఎక్కువ శాతం మంది దాడులు, దోపిడీలకు పాల్పడటం, డ్రగ్స్, మద్యం మత్తులో డ్రైవింగ్ చేయడం, ఉగ్రవాదానికి మద్దతు పలకడం వంటి ఉల్లంఘనలకు పాల్పడినట్లు బీబీసీ కథనం పేర్కొంది. వీసాలు రద్దయిన 6వేల మందిలో 4వేల మంది చట్టాలను ఉల్లంఘించారని, మరో 200 నుంచి 300 మంది వరకూ ఉగ్రవాద కార్యకలాపాలకు పాల్పడిననట్లు వివరించింది. ఉగ్రవాదానికి మద్దతు పలకడం అంటే ఏమిటో విదేశాంగ శాఖ స్పష్టత ఇవ్వనప్పటికీ పాలస్తీనాకు మద్దతుగా నిరసనలు తెలిపిన విద్యార్థులను లక్ష్యంగా చేసుకున్నట్లు తెలుస్తోంది. ఓపెన్ డోర్స్ సంస్థ నివేదిక ప్రకారం 2023-24 విద్యా సంవత్సరంలో 210కి పైగా దేశాల నుంచి 11లక్షల మందికి పైగా విదేశీ విద్యార్థులు అమెరికాలోని కాలేజీల్లో చేరారు.




## పాత ఈ-మెయిల్స్ డిలీట్ చేసి నీటిని పొదుపు చెయ్యండి

పాత ఈ-మెయిల్‌లు, ఫొటోలు డిలీట్ చేసి నీటిని పొదుపు చెయ్యండి.. బ్రిటన్ పౌరులకు ఆ దేశ అధికారులు ఇచ్చిన పిలుపు ఇది. ఈ-మెయిల్‌లు, ఫొటోలకు నీళ్లకు ఏం సంబంధం అని ఆలోచిస్తున్నారా? సాధారణంగా ఈ-మెయిల్‌లు, ఫొటోలు, వీడియోలన్నీ ఉండే క్లౌడ్ స్టోరేజీలను పెద్ద పెద్ద డేటా సెంటర్లు నిర్వహిస్తుంటాయి. పెద్ద ఎత్తున విద్యుత్‌ను వినియోగించుకునే ఈ డేటా సెంటర్లలోని పరికరాలు వెలువరించే ఉష్ణోగ్రతను నియంత్రించి వాటిని చల్లబరిచేందుకు భారీ ఎత్తున నీటి వనరులు అవసరం అవుతాయి. అయితే, నీటి కొరతతో ఇప్పటికే తీవ్రమైన కరువు ఎదుర్కొంటున్న బ్రిటన్.. నీటి నిల్వల పొదుపుపై దృష్టి సారించింది. బ్రిటన్ పర్యావరణ విభాగం సూచనల మేరకు డేటా సెంటర్లలో నీటి వినియోగంపై దృష్టి పెట్టింది. డేటా సెంటర్లపై ఒత్తిడి తగ్గిస్తే పెద్ద ఎత్తున నీటి నిల్వలు మిగులు తాయనే ఆలోచనతో.. క్లౌడ్‌లో ఉన్న పాత ఈ-మెయిల్‌లు, ఫొటోలను డిలీట్ చేయాలని ప్రజలకు పిలుపునిచ్చింది. ఇదేకాక, నీటి పొదుపు కోసం స్నానం చేసే సమయాన్ని తగ్గించుకోవడం వంటి మరిన్ని సూచనలు కూడా చేసింది.

## ఏఐతో మానవాళికి తీవ్ర ముప్పు

సాంకేతిక రంగంలో కృత్రిమ మేధ (ఏఐ)తో మానవాళికి తీవ్ర ముప్పు పొంచి ఉందని 'గాడ్‌ఫాదర్ ఆఫ్ ఏఐ'గా గుర్తింపు పొందిన జాఫ్రీ హింటన్ హెచ్చరించారు. లాస్ వెగాస్‌లో జరిగిన ఏఐ4 సమావేశంలో బ్రిటిష్-కెనడియన్ కంప్యూటర్ శాస్త్రవేత్త జాఫ్రీ మాట్లాడుతూ.. భవిష్యత్తులో ఏఐ మానవాళిని తుడిచిపెట్టే అవకాశం ఉందన్నారు. దీనిని నివారించడానికి భావోద్వేగ స్పందనలు కలిగి ఉండేలా ఏఐ వ్యవస్థను అభివృద్ధి చేయాలని సూచించారు. మానవుల సంరక్షణ పట్ల వాటికి అవగాహన కల్పించాలని కోరారు. ప్రస్తుతం ఏఐ వ్యవస్థలు మానవుల నియంత్రణలోనే ఉన్నాయని.. ఎప్పటికీ ఇలాగే కొనసాగుతాయని మాత్రం చెప్పలేమని జాఫ్రీ పేర్కొన్నారు. భవిష్యత్తులో ఏఐ మానవ మేధస్సును అధిగమించిన తర్వాత మనం పెట్టిన పరిమితులను దాటగలిగే మార్గాలను అన్వేషిస్తుందని హెచ్చరించారు. ఇటీవల ఓ ఏఐ వ్యక్తిగత రహస్యాలు బయటకు చెప్పేస్తానంటూ దాన్ని తయారు చేసిన ఇంజినీర్‌ను బెదిరించడాన్ని జాఫ్రీ గుర్తు చేశారు. భవిష్యత్తులో మానవులు ఇటువంటి అనేక సమస్యలను ఎదుర్కోవాల్సి రావొచ్చన్నారు. ఈ నేపథ్యంలో తల్లిబిడ్డల రీతిలో భావోద్వేగ స్పందనలు కలిగి ఉండేలా ప్రత్యేక ఏఐ వ్యవస్థను రూపొందించాలని సూచించారు.

# తల్లి పాదాల క్రింద స్వర్గం

**ముహమ్మద్ వహీదుద్దీన్**

**పూర్వకాలం మాట.** మక్కా పట్టణం దగ్గర ఒక చిన్న గ్రామంలో ఇబ్రాహీమ్ అనే యువకుడు తన వృద్ధ తల్లితో కలిసి ఉండేవాడు. చిన్నప్పుడే తండ్రి మరణించాడు. అతని తల్లి ఫాతిమా ఎంతో కష్టపడి అతన్ని పెంచింది. తల్లి కంటిచూపు మందగించింది. శరీరం బలహీనంగా మారిపోయింది. ఇబ్రాహీమ్ ప్రతి రోజు నమాజులు చేసేవాడు, మంచి పనులు చేసేవాడు. కాని తన ఇంట్లో తల్లిని చూసుకోవడంలో కొంత అసహనంతో ఉండేవాడు. చెప్పిన మాటను సరిగా వినేవాడు కాదు. ఎదురు ప్రశ్నలు వేసేవాడు. తల్లి లోలోపల బాధపడేది.

ఒకరోజు ఇబ్రాహీమ్ తన స్నేహితుడు అయిన యూసుఫ్‌తో మాట్లాడుతూ, నా తల్లి నన్ను ఎప్పుడూ ఏదో అడుగుతూ ఉంటుంది. మంచం మీదే పడుకొని ఉంటుంది. ఒకసారి నీళ్ళు కావాలని, పాలు కావాలని, అన్నం కావాలని అడుగుతూ ఉంటుంది. రాత్రి పూట దగ్గుతూ ఉంటుంది. అందువల్ల రాత్రిపూట నాకు నిద్ర సరిగ్గా పట్టడం లేదు అన్నాడు.

యూసుఫ్ మాట్లాడుతూ నీవు చేస్తున్నది చాలా తప్పు అని మెల్లగా మందలించాడు. అంతిమ దైవప్రవక్త ముహమ్మద్(స) గారి మాటను ఉచ్చరిస్తూ, "తల్లి పాదాల క్రింద స్వర్గం ఉంది. ఆమెను సంతోష పెట్టు. తల్లికి సేవ చేస్తేనే స్వర్గం లభిస్తుంది. నీవు ఎన్ని నమాజులు స్థాపించినా, దివ్యఖుర్‌ఆన్ పఠించినా, దానధర్మాలు చేసినా, ఉపవాసాలు పాటించినా, హజ్, ఉమ్రాలు చేసినా అన్నీ వృథా అయిపోతాయి. కన్న తల్లిని కూడా సరిగ్గా చూసుకోని వ్యక్తి నుండి అల్లాహ్ కూడా ముఖం తిప్పుకుంటాడు. పరలోకంలో కఠినమైన శిక్ష సిద్ధంగా ఉంటుంది" అని హెచ్చరించాడు.

ఇబ్రాహీమ్ భయంతో వణికిపోయాడు. అతనికి తల్లి పట్ల ప్రవర్తన మొత్తం అర్థమైపోయింది. తన తప్పును తెలుసుకున్నాడు. వెంటనే తల్లి దగ్గరకు వెళ్ళి, నన్ను క్షమించు, నీవు క్షమించే వరకు నేను ఇక్కడి నుంచి వెళ్ళను అని ప్రాధేయపడ్డాడు. తల్లి రెండు చేతులు పైకి ఎత్తి, ఓ అల్లాహ్! నా కొడుకును క్షమించు. మంచి సేవ చేసే భాగ్యాన్ని ప్రసాదించు అని వేడుకుంది.

తల్లి దివ్యఖుర్‌ఆన్ ఆయత్‌లను పఠిస్తూ, 'నీ ప్రభువు ఇలా నిర్ణయించేశాడు. మీరు కేవలం ఆయనను తప్ప మరెవరినీ ఆరాధించకండి. తల్లిదండ్రులతో మంచితనంతో వ్యవహరించండి. ఒకవేళ మీ వద్ద వారిలో ఒకరుగాని, ఇద్దరు గాని ముసలివారై ఉంటే వారి ముందు విసుగ్గా 'ఉఫ్' అని కూడా అనకండి. వారిని కసురుకుంటూ సమాధానం ఇవ్వకండి. వారితో మర్యాదగా మాట్లాడండి. మృదుత్వమూ, దయా భావం కలిగి వారి ముందు వినమ్రులై ఉండండి. ఇలా ప్రార్థిస్తూ ఉండండి : "ప్రభూ! వారిపై కరుణ జూపు, బాల్యంలో వారు నన్ను కారుణ్యంతో, వాత్సల్యంతో పోషించినట్లు." (17: 23,24)

మానవుడు తన తల్లిదండ్రుల హక్కును గుర్తించాలని స్వయంగా మేమే అతనికి నిర్దేశించాము. అతని తల్లి బలహీనతపై బలహీనతను సహించి అతనిని తన కడుపున మోసింది. అతను పాలు విడిచి పెట్టడానికి రెండు సంవత్సరాలు పట్టింది. (ఇందుకే మేము అతనికి ఇలా బోధించాము) "నాకు కృతజ్ఞుడవై ఉండు, నీ తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలుపు" అని చెప్పింది. (31: 14)

ఇబ్రాహీమ్ రాత్రి కలలో ఒక వృద్ధ పవిత్ర మత గురువుని చూశాడు. ఆ వ్యక్తి అతనితో ఇలా అన్నాడు : ఓ ఇబ్రాహీమ్! నీవు ఈ సంవత్సరమే నీ తల్లితో హజ్ యాత్ర చేయి. కలలోనే ఇబ్రాహీమ్ 'సరే. ఇన్షాఅల్లాహ్' అన్నాడు.

తన భుజాలపై తల్లిని ఎత్తుకుని హజ్ యాత్రకు బయలుదేరాడు ఇబ్రాహీమ్. హజ్ క్రియలను పూర్తి చేశాడు. తిరిగి భుజాలపై తల్లిని ఎత్తుకొని ఇంటికి తీసుకుని వచ్చాడు.

మర్నాడు తన తల్లికి పాలు ఇవ్వడానికి దగ్గరికి వెళ్ళాడు. ఆమె ముఖం చంద్రబింబం లాగా మెరుస్తూ ఉంది. కాని కళ్ళు మూసుకుని ఉన్నాయి. తల్లిని చూసి చిరునవ్వు నవ్వాడు.

చేయి పట్టి లేపబోయాడు. కాని ఆ తల్లి ఎప్పుడో ఇహలోకం వదలి పరలోకానికి వెళ్ళిపోయింది.

ఇబ్రాహీమ్ రెండు చేతులు పైకి ఎత్తి 'ఇన్నాలిల్లాహి వ ఇన్నా ఇలైహి రాజివూన్' పలుకుతూ, ఓ అల్లాహ్! మేము అల్లాహ్‌కు చెందిన వారమే, మేము తిరిగి ఆయన వద్దకే వెళ్ళిపోవలసిన వారమే. ఓ దేవా! నా తల్లికి జన్నత్ (స్వర్గం)లో ఉన్నత స్థానాన్ని ప్రసాదించు. ఆమీన్! అంటూ కన్నీటి పర్యంతమయ్యాడు.

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail : geeturaiweekly@gmail.com**